1 St Year Happy Work Anniversary.

షణ్ముఖ

# వెలుగు

RNI : APTEL / 2023 / 89152

ప్రతి వార్త వెలుగు వైపు        తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
THE POWER OF RK PEN

సంపుటి : 2 సంచిక : 167 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ సోమవారం 05 మే 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 167 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE MOnday 05 May 2025 PAGES : 8 PRICE : 3/-

## ఏపీ సర్కార్ మరో కీలక ఒప్పందం..

సీఎం చంద్రబాబు ఆసక్తికర ట్వీట్

క్రియేటివ్‌ల్యాండ్ ఆసియాతో చారిత్రాత్మక అవగాహన ఒప్పందం

25వేల ఉద్యోగాలను సృష్టించే లక్ష్యంతో ఈ ప్రాజెక్ట్

ఈ మేరకు 'ఎక్స్' వేదికగా సీఎం చంద్రబాబు ఇంట్రెస్టింగ్ పోస్ట్



**(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 4)**

ఏపీలోని కూటమి ప్రభుత్వం భారీ పెట్టుబడులే లక్ష్యంగా దూసుకెళ్తోంది. ఈ క్రమంలో తాజాగా మరో ప్రముఖ సంస్థతో కీలక ఒప్పందం చేసుకుంది. ఈ మేరకు సీఎం చంద్రబాబు నాయుడు 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ప్రకటించారు. ఇండియాలోనే మొట్టమొదటి ట్రాన్స్‌మీడియా ఎంటర్‌టైన్‌మెంట్ సిటీ అయిన క్రియేటర్ ల్యాండ్‌ను ప్రజల రాజధాని అమరావతిలో ప్రారంభించడానికి %స్త్రళిజుఆ% క్రియేటివ్‌ల్యాండ్ ఆసియాతో ఏపీ ప్రభుత్వం చారిత్రాత్మక అవగాహన ఒప్పందం చేసుకుందని చంద్రబాబు నాయుడు ట్వీట్ చేశారు. "భారతదేశపు మొట్టమొదటి ట్రాన్స్‌మీడియా ఎంటర్‌టైన్‌మెంట్ సిటీ అయిన క్రియేటర్‌ల్యాండ్‌ను ప్రజల రాజధాని అమరావతిలో ప్రారంభించడానికి క్రియేటివ్‌ల్యాండ్ ఆసియాతో చారిత్రాత్మక అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని ప్రకటించడానికి సంతోషంగా ఉంది. 25వేల ఉద్యోగాలను సృష్టించే లక్ష్యంతో ఈ ప్రాజెక్ట్ ఎఫ్‌డీఐని ఆకర్షించడానికి, పెద్ద ఎత్తున అభివృద్ధిని తీసుకురావడానికి, స్థానిక ప్రతిభను క్రియేట్ ఇన్ ఏపీ క్రియేట్ ఫర్ ది వరల్డ్‌కు శక్తివంతం చేయడానికి సిద్ధంగా ఉంది. ఈ ప్రపంచ స్థాయి సృజనాత్మక టౌన్‌షిప్ చలనచిత్రం, గేమింగ్, సంగీతం, వర్చువల్ ప్రొడక్షన్, లీనమయ్యే కథ చెప్పడం, ఏఐ ఆధారిత కంటెంట్‌కు కేంద్రంగా ఉంటుంది. అత్యాధునిక మౌలిక సదుపాయాలు, ప్రపంచ భాగస్వామ్యాలు, మన యువతకు నైపుణ్యం కల్పించడానికి క్రియేటర్‌ల్యాండ్ అకాడమీతో ఏపీ సృజనాత్మక, డిజిటల్ పరిశ్రమలకు ప్రపంచ గమ్యస్థానంగా మారనుంది" అని సీఎం చంద్రబాబు రాసుకొచ్చారు.

## శ్రీ మహంకాళి అమ్మవారికి సారె సమర్పించిన మంత్రి నారా లోకేశ్

కంఠంరాజ కొండూరు మహంకాళీ ఆలయ పునఃప్రతిష్ట ఉత్సవానికి హాజరైన మంత్రి లోకేశ్

అమ్మవారికి ప్రత్యేక పూజలు... పసుపు, కుంకుమ, గాజులు సమర్పణ

విఘ్నేశ్వర, సుబ్రహ్మణ్యేశ్వర ఉపాలయాల సందర్శన

బకింగ్‌హాం కాలువ పరిశీలన, గుర్రపు డెక్క తొలగింపునకు ఆదేశం

**(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 4)**

రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నేడు మంగళగిరి నియోజకవర్గంలో పర్యటించారు. దుగ్గిరాల మండలం కంఠంరాజ కొండూరు గ్రామంలోని శ్రీ మహంకాళీ అమ్మవారి దేవస్థానం పునఃప్రతిష్ట మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామానికి చేరుకున్న మంత్రి లోకేశ్ కు ఆలయ అధికారులు, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ తొలుత అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు, సారెను సమర్పించారు. అనంతరం ఆలయ అర్చకులు మంత్రికి వేద ఆశీర్వచనాలు అందించి, జ్ఞాపికను బహూకరించారు. ఆలయ ప్రాంగణంలో నూతనంగా ప్రతిష్టించిన శ్రీ విఘ్నేశ్వర స్వామి, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉపాలయాలను కూడా మంత్రి సందర్శించి, అక్కడ ప్రత్యేక పూజలు జరిపారు. మంత్రి రాక సందర్భంగా పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు, భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనూరాధ, పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, టీడీపీ గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, దుగ్గిరాల టీడీపీ మండల అధ్యక్షురాలు కేసమనేని అనిత తదితరులు పాల్గొన్నారు. ఆలయ కార్యక్రమాన్ని ముగించుకుని మంగళగిరికి తిరుగు పయనమైన మంత్రి లోకేశ్, మార్గమధ్యంలో కాజ-చినవడ్లపూడి మధ్య ఉన్న బకింగ్‌హాం మిగతా 2లో






## ఆపరేషన్ 'కగార్' ఆగదు... మావోయిస్టులతో మాటల్లేవ్

తేల్చి చెప్పిన బండి సంజయ్

మావోయిస్టులతో చర్చల ప్రసక్తే లేదన్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

ఆపరేషన్ కగార్‌పై కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గదని స్పష్టీకరణ

తుపాకీ వీడితేనే మావోలతో చర్చలు సాధ్యమంటున్న తేల్చిచెప్పిన కేంద్రం



**(షణ్ముఖ వెలుగు, హైదరాబాద్, మే 4)**

దేశంలో మావోయిస్టుల ఏరివేతకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ కగార్' ను నిలిపివేయాలంటూ కొన్ని రాజకీయ పక్షాలు, పౌర సమాజం నుంచి డిమాండ్లు వస్తున్న వేళ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. మావోయిస్టులతో ఎలాంటి చర్చలు జరిపే ప్రసక్తే లేదని ఆయన కుండబద్దలు కొట్టారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల ఈ ఆపరేషన్‌పై స్పందించిన తర్వాత నెలకొన్న రాజకీయ చర్చల నేపథ్యంలో బండి సంజయ్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. కరీంనగర్‌లోని కొత్తపల్లిలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న బండి సంజయ్ కుమార్, ఆపరేషన్ కగార్ మరియు మావోయిస్టులతో చర్చల అంశంపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేశారు. "తుపాకీ చేతపట్టి అమాయకులను పొట్టనపెట్టుకున్నవాళ్లతో చర్చలు ఉండవు. వారితో మాటలు లేవు... మాట్లాడుకోవడాలు లేవు" అని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. మావోయిస్టులను చట్టవిరుద్ధ సంస్థగా ప్రకటించిందే కాంగ్రెస్ పార్టీ అని ఆయన గుర్తు చేశారు. నక్సల్స్ హింసాత్మక చర్యల వల్ల ఎంతో మంది రాజకీయ నాయకులు, అమాయక గిరిజనులు ప్రాణాలు కోల్పోయారని బండి సంజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. "కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ సహా ఎన్నో పార్టీల నేతలను మందుపాతరలు పెట్టి చంపారు. అమాయక గిరిజనులను ఇన్‌ఫార్మర్ల నెపంతో అన్యాయంగా కాల్చి చంపి ఎన్నో కుటుంబాలకు మావోయిస్టులు తీరని శోకాన్ని మిగిల్చారు" అని ఆయన తెలిపారు. ఆయుధాలు వీడితే తప్ప మావోయిస్టులతో చర్చలు జరపబోమని ఆయన తేల్చిచెప్పారు. మిగతా 2లో

## యుద్ధం మొదలైతే.. పాక్ శతఘ్ని గుండ్లు నాలుగు రోజుల్లో ఖాళీ..

**(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 4)**

భారత్‌తో యుద్ధం మొదలైతే పాకిస్థాన్ వద్ద శతఘ్ని గుండ్లు కేవలం నాలుగు రోజుల్లో ఖాళీ అయిపోతాయని ఓ ఆంగ్ల వార్త సంస్థ కథనంలో పేర్కొంది. ఆ దేశం వద్ద ప్రస్తుతం అతి తక్కువ స్థాయిలో వీటి నిల్వలు ఉన్నట్లు పేర్కొంది. మరోవైపు సైనిక ఘర్షణల కారణంగా ప్రపంచ వ్యాప్తంగా ఈ గుండ్లకు డిమాండ్ పెరగడంతో.. పాక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు వీటిని ఉత్పత్తి చేయడానికి నానా అవస్థలు పడుతున్నాయి. ఇటీవల కాలంలో పాక్ యుద్ధ రిజర్వులు చాలా వరకు ఉక్రెయిన్‌కు విక్రయించడంతో.. దాయాది వద్ద నిల్వలు పడిపోయాయి. ప్రస్తుతం ఉన్నవి కేవలం 96 గంటలకు సరిపోతాయని ఓ నివేదిక వెల్లడించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం భారత్‌పై పాక్ అనుసరిస్తున్న మోహరింపుల వ్యూహం విజయవంతం కావాలంటే శతఘ్నుల పాత్ర చాలా కీలకం. ముఖ్యంగా ఎం109 హోవిట్జర్లకు 155 ఎంఎం గుండ్లు, బీఎం 21 సిస్టమ్స్‌కు 122 ఎంఎం రాకెట్లు ఆ దేశ సైన్యం రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేస్తాయి. వీటిల్లో 155 ఎంఎం గుండ్లను ఉక్రెయిన్‌కు ఎగుమతి చేసింది. భారత్ ఎదురుదాడి వ్యూహాన్ని అమలు చేస్తే మాత్రం పాక్ చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా శతఘ్నులు, సెల్ఫ్‌ప్రొపెల్డ్ గన్స్, ఎంజీఎస్ వ్యవస్థల పనితీరు గణనీయంగా పడిపోనుంది. మరోవైపు పాక్ సైనిక నాయకత్వం తీవ్ర ఆందోళన చెందుతోంది. మే2న జరిగిన ఆ దేశ కోర్ కమాండర్ల సమావేశంలో కూడా ఈ అంశం ప్రస్తావనకు వచ్చినట్లు తెలుస్తోంది. ఇక గతంలో పాక్ మాజీ ఆర్మీచీఫ్ ఖమర్ జావెద్ భజ్వా కూడా ఆర్థిక బలహీనత ప్రభావం సైనిక దళాల మందుగుండుపై పడుతున్నట్లు పేర్కొన్నారు. పాక్ తన మిగతా 2లో



## నాపై నిరాధార ఆరోపణలు.. భూమా అఖిలప్రియ

ఆరోపణలు నిరూపిస్తే రాజీనామా చేస్తానని సవాల్

అహోబిలంలో అక్రమ నిర్మాణాలను కూల్చేందుకు సిద్ధమని వెల్లడి

ఆళ్లగడ్డలో చికెన్ వ్యాపారం గురించి అవాస్తవ కథనాలు రాస్తున్నారని ఫైర్

**(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 4)**

వైసీపీ నాయకులు తనపై నిరాధార, తప్పుడు ఆరోపణలు చేస్తున్నారంటూ ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తీవ్రంగా మండిపడ్డారు. ఓ దినపత్రికలో తనపై తప్పుడు కథనాలు ప్రచురిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను బీట్యాక్స్ వసూలు చేస్తున్నానని కథనాలు ప్రచురించారని విమర్శించారు. తనపై వచ్చిన ఆరోపణలపై చర్చకు సిద్ధమని ఆమె స్పష్టం చేశారు. ఆరోపణలు మిగతా 2లో



## ప్రధాని మోదీతో ఎయిర్ చీఫ్ మార్షల్ భేటీ

**(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 4)**

ప్రధాని నరేంద్ర మోదీతో ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్ భేటీ అయ్యారు. దిల్లీలోని ప్రధాని నివాసంలో ఈ సమావేశం జరిగింది. భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న వేళ ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. అంతకు ముందు రోజే నౌకాదళాధిపతి అడ్మిరల్ దినేష్ కె త్రిపాఠీ కూడా ప్రధానిని ఆయన నివాసంలో కలుసుకున్నారు.

పహల్గాం ఉగ్రదాడి తర్వాత భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ భేటీ జరిగింది. ఉగ్రవాదులపై చర్యలు తీసుకునేందుకు త్రివిధ దళాలకు ఈ భేటీలో పూర్తి స్వేచ్ఛను ఇచ్చారు. లక్ష్యాలు, దాడి సమయం అవి నిర్ణయిస్తాయని నాడు సీసీఎస్ వెల్లడించింది. ఇక శుక్రవారం సన్నద్ధతలో భాగంగా యూపీలోని గంగా ఎక్స్‌ప్రెస్‌వేపై వాయుసేన యుద్ధ విమానాల ల్యాండిగ్, టేకాఫ్ విన్యాసాలను నిర్వహించింది. 2019లో పుల్వామా దాడికి ప్రతీకారంగా భారత్ వాయుసేన పాక్‌లోకి ప్రవేశించి దాడి చేసింది. నాటితో పోల్చుకొంటే రఫేల్ యుద్ధ విమానాలు, ఎస్-400 ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలతో ఐఏఎఫ్ శక్తి గణనీయంగా పెరిగింది.



## మరోసారి దేశంలో ఉగ్రదాడులు జరగకుండా.. భారత ప్రతిస్పందన ఉండాలి

**(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ,మే 4)**



పహల్గాం ఉగ్రదాడనేపథ్యంలో భారత్-పాకిస్థాన్‌ల మధ్య పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. భారత్ నుంచి ఎప్పుడు, ఏ విధంగా దాడి ఉంటుందోనని పాక్ వణుకు తోంది. ఈ నేపథ్యంలో దాయాదికి గట్టి సమాధానం ఇచ్చేందుకు భారత్ సిద్ధంగా ఉందని కాంగ్రెస్ నేత సచిన్ పైలట్ వెల్లడిం చారు. మరోసారి దేశంలో ఉగ్రదాడులు జరగకుండా.. భారత్ నుంచి ప్రతిస్పందన ఉండాలని ఆయన కోరారు. ఈ విషయంలో విపక్షాలన్ని ఐక్యంగా ఉన్నాయని పేర్కొన్నారు. "పాకిస్థాన్‌కు తగిన సమాధానం ఇచ్చేందుకు భారత్ పూర్తి సిద్ధంగా ఉంది. ప్రతిపక్షాలే కాదు.. దేశంలోని 140 కోట్ల ప్రజలు ఉగ్రవాదాన్ని నిర్మూలించడానికి ఐక్యంగా ఉన్నారు. దేశంలో ఇకపై ఉగ్రదాడులు జరగకుండా.. సాధ్యమైనంత ఉత్తమ మార్గంలో భారత్ నుంచి ప్రతిస్పందన ఉండాలి" అని సచిన్ పైలట్ కోరారు. మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీతో ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్ భేటీ అయ్యారు. దిల్లీలోని ప్రధాని నివాసంలో ఈ సమావేశం జరిగింది. భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న వేళ ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది.

## రైతుల పట్ల జగన్ కు ఎప్పుడూ చిత్తశుద్ధి లేదు మంత్రి నాదెండ్ల విమర్శలు

గత వైసీపీ ప్రభుత్వంపై మంత్రి నాదెండ్ల విమర్శలు

వైసీపీ సర్కారు పెట్టిన బకాయిలు తాము చెల్లించామని వెల్లడి

ధాన్యం కొనుగోలు తర్వాత 24 గంటల్లోనే రైతులకు చెల్లింపులు చేస్తున్నామని స్పష్టీకరణ



**(షణ్ముఖ వెలుగు, అమరావతి, మే 4)**

ఆంధ్రప్రదేశ్ రైతుల పట్ల జగన్ కు ఎప్పుడూ చిత్తశుద్ధి లేదని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పేరుకు పోయిన బకాయిలను తమ ఎన్డీయే ప్రభుత్వం ప్రాధాన్యతగా తీసుకుని చెల్లించిందని సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. రైతుల సంక్షేమానికి, వారికి సకాలంలో చెల్లింపులు జరపడానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆయన స్పష్టం చేశారు. మిగతా 2లో

## మొదటి పేజీ తరువాయి



# శ్రీ మహంకాళి అమ్మవారికి సారె సమర్పించిన మంత్రి నారా లోకేశ

కాలువను పరిశీలించారు. కాలువలో గుర్రపు డెక్క భారీగా పేరుకుపోయి ఉండటాన్ని ఆయన గమనించారు. త్వరలో వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో, రైతులకు నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకం కలగకుండా ఉండేందుకు తక్షణమే గుర్రపు డెక్కను పూర్తిగా తొలగించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను మంత్రి లోకేష్ ఆదేశించారు.

# యుద్ధం మొదలైతే.. పాక్ శతఘ్ని గుండ్లు నాలుగు రోజుల్లో ఖాళీ..

మందుగుండు నిల్వల కేంద్రాన్ని అత్యవసర స్థితిలో వేగంగా వాడుకునేందుకు భారత్ సరిహద్దుల్లోనే ఏర్పాటు చేసింది.

**భారత్‌లో 12 ఆర్డినెన్స్ ఫ్యాక్టరీల్లో జోరుగా ఉత్పత్తి..**

మరోవైపు భారత్‌కు చెందిన మ్యూనిషన్స్ ఇండియా లిమిటెడ్ తన ఆర్డినెన్స్ ఫ్యాక్టరీల్లో ఉత్పత్తిని భారీగా పెంచుతోంది. ఇప్పటికే ఉద్యోగులకు ఇచ్చిన సెలవులను అర్ధంతరంగా రద్దు చేసినట్లు ఓ ఆంగ్లపత్రిక కథనంలో పేర్కొంది. ఉద్యోగులు వెంటనే విధుల్లో చేరాలని కోరినట్లు తెలుస్తోంది. వచ్చే రెండు నెలల వరకు రెండ్రోజుల ముందు సమాచారం లేకుండా ఎటువంటి సెలవులు ఉండవని పేర్కొంది. కాకపోతే దీనిపై అధికారికంగా ఎటువంటి సమాచారం బయటకు వెలువడలేదు.

# నాపై నిరాధార ఆరోపణలు.. భూమా అఖిలప్రియ

నిరూపిస్తే తన పదవికి రాజీనామా చేస్తానని ఆమె సవాల్ విసిరారు. ఈ మేరకు శనివారం నంద్యాలలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో అఖిలప్రియ మీడియాతో మాట్లాడారు. అహోబిలంలో అక్రమంగా సత్రాలు, హోటళ్లు నిర్మిస్తున్నారని, వాటికి తాను అనుమతిచ్చానని ఈ ఏడాది ఫిబ్రవరిలో ఓ పత్రిక రాసిందని తెలిపారు.అయితే, అహోబిలం సర్పంచ్ వైసీపీ నేత అని ఆమె గుర్తుచేశారు. గ్రామ పరిధిలో నిర్మాణాలు చేపట్టాలంటే సర్పంచ్ అనుమతి, గ్రామ పంచాయతీ తీర్మానం అవసరమనే విషయం వైసీపీ నేతలు మర్చిపోయారని చెప్పారు. అక్రమాలకు పాల్పడింది వైసీపీ నేతలైతే తనపై తప్పుడు కథనాలు ప్రచురిస్తున్నారని అఖిలప్రియ మండిపడ్డారు. అహోబిలంలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను కూల్చేందుకు తాను సిద్ధమని, వైసీపీ వాళ్లు కూడా సిద్ధమేనా అని నిలదీశారు. ఇక ఆళ్లగడ్డలోనూ చికెన్ వ్యాపారంపై అవాస్తవాలతో కథనాలు ప్రచురించారని అఖిలప్రియ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# రైతుల పట్ల జగన్ కు ఎప్పుడూ చిత్తశుద్ధి లేదు

## మంత్రి నాదెండ్ల విమర్శలు

గత ప్రభుత్వం రైతులకు చెల్లించాల్సిన సుమారు రూ.1,674 కోట్ల బకాయిలను తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చెల్లించిందని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రైతులకు ఆర్థికంగా అండగా నిలవడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 5.65 లక్షల మంది రైతుల నుంచి 35.94 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసిందని వివరించారు. ఇందుకు గాను రూ.8,277.59 కోట్లను కేవలం 24 గంటల వ్యవధిలోనే నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు ఆయన వెల్లడించారు.అదేవిధంగా, ప్రస్తుత రబీ సీజన్‌లో కూడా ధాన్యం సేకరణ వేగంగా జరుగుతోందని మంత్రి తెలిపారు. ఇప్పటివరకు 1,16,627 మంది రైతుల నుంచి 12.38 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని, దీనికి సంబంధించిన రూ. 2,722.81 కోట్లను కూడా 24 గంటల్లోనే రైతుల ఖాతాలకు బదిలీ చేశామని ఆయన వివరించారు. రైతుల కష్టానికి తక్షణమే ప్రతిఫలం అందించాలనే ఉద్దేశ్యంతో ఈ సత్వర చెల్లింపుల విధానాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.రైతులకు అన్ని విధాలా మద్దతుగా నిలవడం, వారి ఉన్నతికి కృషి చేయడమే ఎన్డీయే కూటమి ప్రభుత్వ ప్రధాన అజెండా అని నాదెండ్ల మనోహర్ పునరుద్ఘాటించారు. గత ప్రభుత్వ వైఫల్యాలను సరిదిద్దుతూ, అన్నదాతలకు అండగా నిలుస్తామని ఆయన భరోసా ఇచ్చారు. ఈ మేరకు పలు గ్రాఫ్ లను కూడా మంత్రి నాదెండ్ల సోషల్ మీడియాలో పంచుకున్నారు.

## ఆపరేషన్ 'కగార్' ఆగదు...

# మావోయిస్టులతో మాటల్లేవ్

కొన్ని రాజకీయ పక్షాలు, ముఖ్యంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మావోయిస్టులతో చర్చలు జరపాలని పోటీ పడుతున్నాయని బండి సంజయ్ ఆరోపించారు. రాష్ట్రంలో ఆరు గ్యారంటీల అమలులో వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్ ఇలాంటి అంశాలను తెరపైకి తెస్తోందని విమర్శించారు. శాంతి భద్రతల సమస్యను రాజకీయం చేయడం సరికాదని హితవు పలికారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎన్‌డీఎస్ఏ నివేదిక ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు.ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కేంద్రానికి లేఖ రాయనున్నారన్న వార్తల నేపథ్యంలో, బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశమయ్యాయి. మావోయిస్టుల విషయంలో కేంద్రం కఠినంగానే వ్యవహరిస్తుందని, చర్చలకు ఆస్కారం లేదని ఆయన వ్యాఖ్యల ద్వారా స్పష్టమవుతోంది.

# హైవేపై కంటైనర్‌లారీ భీభత్సం

## వాహనంతో పాటు సీసీ కెమెరాలు ధ్వంసం
## తిమ్మాపురం శివారులో రోడ్డు ప్రమాదం
## డ్రైవర్ నిద్రమత్తుతోనే ఘటన
## తప్పిన పెనుప్రమాదం



**(షణ్ముఖ వెలుగు, చిలకలూరిపేట, మే 4)**

చిలకలూరిపేట నియోజకవర్గం యడ్లపాడు మండలం తిమ్మాపురం శివారులో ఆదివారం మధ్యాహ్నం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. చెన్నై నుంచి గుంటూరు దిశగా వేగంగా ప్రయాణిస్తున్న కంటైనర్ లారీ, డ్రైవర్ నిద్ర మత్తు కారణంగా అదుపుతప్పి నేరుగా హైవే సెంట్రల్ డివైడర్‌పై ఎక్కింది. అక్కడ ఏర్పాటు చేసిన భారీ ఇనుప స్తంభాన్ని ఢీకోవడంతో వాహనం ముందు భాగంతో పాటు స్తంభానికి బిగించిన సీసీ కెమెరాలు ధ్వంసం అయ్యాయి. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, ఇనుప స్తంభాలను తొలగించి రహదారి మీద ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. మధ్యాహ్న సమయం కావడం, వాహనాల రద్దీ లేకపోవడం, ఎవరికీ గాయాలు కాలేదు. పెను ప్రమాదం తప్పిందని అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదానికి డ్రైవర్ అలసట, నిద్రమత్తే ప్రధాన కారణమని పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ప్రమాదం జరిగిన చోట సీసీ కెమెరాలు ధ్వంసమైన నేపథ్యంలో, యుద్ధప్రాతిపదికన వాటిని తొలగించి ట్రాఫిక్‌ను సరళీకృతం చేసినట్లు ఎస్ఐ టి శివరామకృష్ణ తెలిపారు.





# నీట్ పరీక్ష 2025 రాత పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను స్వయంగా పరిశీలించిన జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్

## బందోబస్తు విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 4)**

ఎన్టీఏ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహిస్తున్న నీట్ రాత పరీక్షా సజావుగా సాగేందుకు జిల్లాలో ఐదు సెంటర్ లో డీఆర్ఆర్ఎం జవహర్ నవోదయ విద్యాలయం, కేంద్రీయ విద్యాలయం, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మొత్తం 5 పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని, 1473 మంది విద్యార్థులు ఈ నీట్ పరీక్షకు హాజరుకానున్నట్లు జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ తెలిపారు. ఈ నీట్ పరీక్ష నిర్వహించే కేంద్రాలు డీఆర్ఆర్ఎం జవహర్ నవోదయ విద్యాలయం, కేంద్రీయ విద్యాలయం పరీక్షా కేంద్రలను జిల్లా ఎస్పీ సందర్శించి, అక్కడి భద్రతా ఏర్పాట్లను స్వయంగా పరిశీలించి, బందోబస్తు విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పలు సూచనలు తెలియచేసినారు. పరీక్షా కేంద్రాలలోకి మొబైల్ ఫోన్లు, డిజిటల్ వాచ్లు, బ్లూ టూత్, కాలిక్యులేటర్లు తదితర ఎలక్ట్రానిక్ గాడ్జెట్సును అనుమతించరాదని, పరీక్ష వ్రాసేందుకు వచ్చిన ప్రతి ఒక్క విద్యార్థిని పూర్తిగా తనిఖీ (ఫ్రిస్కింగ్) చేసిన తర్వాతే పరీక్ష హాల్లోకి అనుమతించాలన్నారు. ముఖ్యంగా, పరీక్షా కేంద్రాల పరిసరాల్లోకి అనధికార వ్యక్తులు ఎవరూ రాకుండా చూడాలని, గుర్తింపు కార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలని, ఎటువంటి అనుమానాస్పదంగా అనిపించినా వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలని సూచించారు. పరీక్ష రాసే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని పరీక్ష నిర్వహక అధికారులకు ఎస్పీ తెలియజేశారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ అత్యంత ముఖ్యమైన నీట్ పరీక్ష జరుగుతుందని, విద్యార్థుల భవిష్యత్తును నిర్దేశించే ఈ పరీక్ష ప్రశాంతంగా, సజావుగా జరగటానికి అన్ని పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని, పరీక్షా కేంద్రాల వెలుపల 144 సెక్షన్ అమలులో ఉందని, ఈ పరీక్షలు ముగిశాక ఆ పత్రాలు పటిష్ట భద్రతా నడుమ స్ట్రాంగు రూంలకు తరలించడం జరిగిందని, పరీక్షా కేంద్రాల పరిసరాలలో జిరాక్స్ మరియు ఇంటర్నెట్ సెంటర్లు ముందుగానే మూయించామని, ప్రతి 'నీట్' పరీక్షా కేంద్రాల పరిసరాల వద్ద డ్రోన్ కెమెరా తో నిఘా ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా పెట్టడం జరిగింది అని జిల్లా ఎస్పి తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా మరియు సజావుగా నిర్వహించేలా పోలీస్ శాఖ తరపు నుండి అన్ని చర్యలు తీసుకున్నామని తెలియచేసినారు. ఎవరైనా అనుమానిత వ్యక్తులు ఉన్నట్లు తెలిస్తే వెంటనే అదుపులోకి తీసుకొని విచారించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. జిల్లా ఎస్పీ వెంట ఏ ఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, ఎస్బి ఇన్స్‌పెక్టర్ రాఘవేంద్ర, ఒంగోలు వన్ టౌన్ సీఐ నాగరాజు, సిబ్బంది ఉన్నారు.





# ఉచిత సున్తీ కార్యక్రమానికి విశేష స్పందన

**(షణ్ముఖ వెలుగు, కనిగిరి, మే 4)**

కెఎస్ఎం ఎడ్యుకేషనల్ సొసైటీ సహకారంతో కనిగిరి మున్సిపాలిటీ చైర్మన్, కె ఎస్ ఎం ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ అడ్వకేట్ షేక్ అబ్దుల్ గఫార్ ఆధ్వర్యంలో ఆదివారం కనిగిరి పట్టణం మరియు పరిసర ప్రాంతం లోని పేద ముస్లిం చిన్నారులకు ఉచిత సున్తి కార్యక్రమం నిర్వహించారు.ఉచిత సున్తీ కార్యక్రమానికి విశేష స్పందన వచ్చింది. సున్తీ చేయించే ముందు, వైద్యులు ప్రయోజనాలు మరియు జాగ్రత్త ల గురించి వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి 103 మందికి సున్తి చేశారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ కె ఎస్ ఎం ఎడ్యుకేషనల్ సొసైటీ ద్వారా 18 సంవత్సరాల నుండి సున్తి కార్యక్రమం నిర్వహిస్తున్నామని ముస్లింలు పిల్లలకు సున్తీ చేయించడానికి ఖర్చుతో కూడిన కార్యక్రమం కాబట్టి వారికి ఆర్థికపరమైన ఇబ్బందులు లేకుండా ఉండటానికి ఈ కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నామని అన్నారు.మతపరమైన, సాంస్కృతిక, వైద్య ప్రయోజనాల కోసం సున్తీ చేయవచ్చునని తెలిపారు.సున్తీ చేయించుకున్న చిన్నారులకు పౌష్టికాహార నిమిత్తం ఐదు కేజీలు గోధుమపిండి కేజీ బెల్లం నెయ్యి బ్రెడ్డు అరటి పండ్లు, మెడికల్ కిట్టు పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి దూర ప్రాంతాల నుంచి హాజరైన చిన్నారులకు వారి తల్లిదండ్రులకు టిఫిన్ భోజనం సౌకర్యం కూడా కల్పించడమైనది.ఈ కార్యక్రమానికి పుర ప్రముఖులు రాజకీయ నాయకులు అధికారులు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు సామాజిక కార్యకర్తలు పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సున్తీ చేయించుకున్న చిన్నారి తల్లిదండ్రులు కెఎస్ఎం ఎడ్యుకేషన్ సొసైటీ వారికి ప్రత్యేకమైన ధన్యవాదములు తెలిపారు.





షణ్ముఖ
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం



## ప్రశాంతంగా ముగిసిన నీట్ పరీక్షలు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 4)

జిల్లాలో ఆదివారం జరిగిన నీట్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఒంగోలులోని డిఆర్ఆర్ఎం మున్సిపల్ హై స్కూల్, జవహర్ నవోదయ, కేంద్రీయ (తరువాయి 4లో...)

# రేషన్ దందా ఆగేదెప్పుడు



### యథేచ్ఛగా రేషన్ బియ్యం బ్లాక్ మార్కెట్ కు తరలింపు

### కేసులతోనే సరి పెడుతుండడంతో

### మళ్లీ కొనసాగుతున్న అదే దందా

### పీడీ యాక్టుకు అవకాశం ఉన్నా దృష్టి

### సారించని అధికారులు

(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం ఇన్‌ఛార్జి, మే 4)

యర్రగొండపాలెం నియోజకవర్గంలో రేషన్ బియ్యం అక్రమ రవాణా మూడు పువ్వులు, ఆరు కాయలుగా కొనసాగుతోంది. ఇక్కడ తక్కువ ధరకు కొని అక్కడ అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఇక్కడ ఒక్కో కుటుంబం నుంచి కిలోల లెక్కన కొనుగోలు చేసి క్వింటాళ్ల లెక్కన బయట విక్రయి స్తున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు అప్పుడప్పుడు కేసులు నమోదు చేస్తున్నారు తప్పితే లోతుగా దర్యాప్తు చేయడం లేదన్న ఆరోపణలున్నాయి. ప్రజాపంపిణీ బియ్యం పక్కదారి పడుతున్నాయి.కూటమి ప్రభుత్వం కొలువు దీరిన తరువాత కొన్ని నెలలు వరకు స్తబ్దుగా ఉన్న రేషన్ బియ్యం వ్యాపారులు ఇప్పుడు అక్రమ బియ్యం రవాణాకు తెరలేపారు. రాజకీయ అండదండలతో ఈ వ్యవహారానికి అడ్డూ అదుపు లేకుండా పోతోంది. రేషన్‌బియ్యం సేకరణకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక ముఠాలు పని చేస్తున్నాయి. చైన్ సిస్టంలా పని చేస్తూ ఒకరినుంచి (తరువాయి 4లో...)

## దివ్యాంగుడి బాధను తనదిగా భావించిన నేత

### ప్రజా సేవలో మానవీయత చాటిన ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, మే 4)

మార్కాపురంలో ఆదర్శ నాయకత్వానికి మారు పేరు అయిన ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మరోసారి తన మానవీయ దృక్పథాన్ని చాటారు. ఓ దివ్యాంగుడి గుండె నిండిన వేదనను స్వయంగా విని, తక్షణమే స్పందిస్తూ పింఛన్ కల్పించే హామీ ఇవ్వడం ప్రజల మనసును తాకింది.

**కార్యకర్తల సమావేశం మధ్యలో మానవతా సందేశం...**

మార్కాపురం పట్టణంలో ఆదివారం జరుగుతున్న పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న కందుల నారాయణరెడ్డి కి ఒక దివ్యాంగుడు తన సమస్యతో వచ్చాడని కార్యకర్తలు తెలియజేశారు. వెంటనే సమావేశాన్ని ఒకింత పక్కనబెట్టి, ఆ దివ్యాంగుడి వద్దకు స్వయంగా వెళ్లిన ఎమ్మెల్యే ఆయన ఆరోగ్య పరిస్థితి, జీవన పరిస్థితుల పై ఆరా తీశారు. ఎన్నో సంవత్సరాలుగా పింఛన్ దరఖాస్తు చేసుకున్నప్పటికీ వచ్చిన అన్యాయంపై ఆ దివ్యాంగుడు ఆవేదన వ్యక్తం చేశారు.

"నీ బాధ నాది కూడా" అన్న మాటతో ఊరట

దివ్యాంగుడి ఆవేదన విన్న ఎమ్మెల్యే కందుల "నీ బాధ నాది కూడా.... మున్ముందు నీకు న్యాయం జరిగేలా చూస్తా" అంటూ పింఛన్ ఏర్పాటుకు తాను స్వయంగా సంబంధిత అధికారులతో చర్చిస్తానని హామీ ఇచ్చారు. ఈ మాటలు విన్న దివ్యాంగుడు ఆనందంతో ఉప్పొంగిపోయాడు. "జై కందుల...జై జై కందుల" అంటూ గట్టిగానే నినాదాలు చేస్తూ, తన బాధలు పంచుకున్న వ్యక్తి ఓ ఎమ్మెల్యే కావడం తన జీవితంలో మరిచిపోలేని సంఘటనగా అభివర్ణించాడు.

**మానవీయతకు ప్రత్యక్ష సాక్ష్యంగా నిలిచిన ఈ ఘటన**

ఈ ఘటన మామూలు దినచర్యగా మిగలకూడదు. ఓ ప్రజాప్రతినిధి, అధికారి గద్దె పై కూర్చున్న వారికి (తరువాయి 4లో...)

## కోర్టు భవనాన్ని ప్రారంభించిన హైకోర్టు న్యాయమూర్తి తర్లాడ రాజశేఖర్‌రావు

(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, మే 4)

శింగరాయకొండలో సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు ప్రారంభోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి, ప్రకాశం జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ తర్లాడ రాజశేఖర్ రావు హాజరై కోర్టు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కోర్టు భవనానికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె. మన్మధరావు ప్రారంభోత్సవం చేశారు, జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్, జస్టిస్ వై. లక్ష్మణ రావులు కోర్టులోని కార్యాలయాలకు ప్రారంభోత్సవం చేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన హైకోర్టు న్యాయమూర్తులకు వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి శ్రీమతి ఏ. భారతి అధ్యక్షతన జరిగిన సభలో జస్టిస్ టి రాజశేఖర్‌రావు మాట్లాడుతూ ఈ ప్రాంతానికి ఈ కోర్టు చాలా అవసరమని అన్నారు. ప్రతి ఒక్కరికీ న్యాయం అందే విధంగా ఈ కోర్టు ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ కోర్టు రావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జస్టిస్ కే మన్మధరావు మాట్లాడుతూ శింగరాయకొండకు కోర్టు అవసరమని చాలా ఏళ్ల క్రితమే గుర్తించామన్నారు. ఇక్కడ న్యాయవాదులు కందుకూరు కోర్టుకు వెళ్లడం ద్వారా వృత్తిపరంగా ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నట్లు చెప్పారు. ప్రస్తుతం నలుగురు హైకోర్టు న్యాయమూర్తులు శింగరాయకొండకు వచ్చి ఈ కోర్టును ప్రారంభించడం చాలా మంచి శుభ పరిణామం అని అన్నారు. జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ఈ కోర్టు ఎంతో మందికి ఉపయోగపడే విధంగా ఉంటుందన్నారు. (తరువాయి 4లో...)



# ఒంగోలులో మృత్యుఘోష



### రక్తమోడిన రహదారి

### పలు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతి

### ఘటనను స్వయంగా పరిశీలించిన ఎస్పీ ఏ ఆర్ దామోదర్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 4)

ఓ ఉదయం... ఓ కుటుంబం తమ గమ్యానికి బయలుదేరింది. కానీ దురదృష్టం వారిని అర్ధరాత్రి మార్గంలో ఎదుర్కొంది. ప్రకాశం జిల్లా ఒంగోలు సమీపంలోని జాతీయ రహదారి ఎన్‌హెచ్-16 పై ఆదివారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం ఐదుగురి అమూల్యమైన ప్రాణాలను బలితీసుకుంది. ఈ ప్రమాదంలో రావినూతల బాబు (42), రావినూతల నాగేంద్ర (20), షేక్ రహీం (60), తిరుమలశెట్టి పావని (42), తిరుమలశెట్టి కౌశిక్ (16) ప్రాణాలు కోల్పోయారు. ఇది మానవ జీవితాల విలువను గుర్తు చేసే ఉదంతంగా మారింది. ఈ విషాదకర ఘటన కొప్పోలు ఫ్లైఓవర్ వద్ద ఉదయం 4:50 గంటల సమయంలో చోటుచేసుకుంది. ఒకే దారిపై వరుసగా మూడు వేర్వేరు ప్రమాదాలు జరిగిన ఈ ఘటన, ఒక్కసారిగా ఓ కుటుంబం, ఓ గ్రామం, ఓ సమాజాన్ని కన్నీళ్లలో ముంచింది. తమ జీవన పోరాటంలో నిమగ్నమైన సాధారణ పౌరులు ఒక్కసారిగా ప్రమాద బారిన పడటం, వారి కుటుంబాలను శోకసంద్రంలోకి నెట్టింది. ప్రమాద స్థలానికి వెంటనే చేరుకున్న ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్, తీవ్ర ఉద్వేగంతో పరిస్థితిని సమీక్షించారు. సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తూ, బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. "ఈ అమాయకుల ప్రాణ నష్టం బాధాకరం. ఇకపై ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తాం," అంటూ ఆయన హృదయాన్ని తాకేలా స్పందించారు.









**ప్రాణాలు తీసిన వేగం**

**నిర్లక్ష్యం ఘోరమైన మానవీయ నష్టం**

ఘటనల క్రమం ఇలా సాగింది...కొప్పోలు వద్ద ఆగి ఉన్న లారీని వేగంగా వస్తున్న కోడిగుడ్ల లారీ ఢీకొనడంతో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ప్రాంతంలో కారు, ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ ఎలాంటి నష్టం కలిగించలేదు. కానీ మూడో ప్రమాదం మాత్రం మరింత దారుణంగా సాగింది. ఓ కారును వెనుక వైపు నుంచి బలంగా ఢీకొన్న లారీ, ఇద్దరు ప్రాణాలను లేవనెత్తింది. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ మృత్యు ఘంటికలు ఆ కుటుంబాల పై ఎన్నటికీ మరచిపోలేని ముద్ర వేసాయి.

**పోలీసుల స్పందన**

**బాధితులకు మానవీయ ఆదరణ**

ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని అంబులెన్స్‌లో ఒంగోలు రిమ్స్ మరియు సంఘమిత్ర ఆసుపత్రులకు తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడంతో పాటు, మృతుల కుటుంబాలను ధైర్యం చెప్పేందుకు ప్రయత్నించారు. (తరువాయి 4లో...)

# ఒంగోలులో మృత్యుఘోష








**భవిష్యత్తులో ప్రమాదాలకు అడ్డుకట్ట జిల్లా పోలీసుల సంకల్పం**

రహదారులపై ప్రాణాలను కాపాడే బాధ్యతను ముందుంచిన జిల్లా ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ “ప్రమాద ప్రాంతాలను గుర్తించి, తగిన సూచనలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తాం. ప్రజల్లో రహదారి భద్రతపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడతాం,” అని తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో భద్రతా లోపాలను సరిదిద్దనున్నామని చెప్పారు. ఈ పరిశీలనలో ఆయన వెంట ఉప రవాణా కమిషనర్ ఆర్ సుశీల, అడిషనల్ ఎస్పీ కె నాగేశ్వరరావు, డీఎస్పీ ఆర్ శ్రీనివాసరావు, తాలూకా సీఐ అజయ్ కుమార్, గిద్దలూరు సీఐ సురేష్, ఇతర నేషనల్ హైవే అధికారులు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

**ప్రాణాల్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి**

ఎస్పీ ఏ ఆర్ దామోదర్ చివరగా ప్రజలను ఉద్దేశించి చేసిన విజ్ఞప్తి హృదయాన్ని తాకుతుంది: “ఒక్క వేగం... ఒక్క అజాగ్రత్త... ఒక్క నిర్లక్ష్యం జీవితాన్ని హరిస్తుంది. వాహనదారులు ట్రాఫిక్ నియమాలను పాటించాలి. వేగ పరిమితులకు లోబడి ప్రయాణించాలి. ప్రతి ప్రయాణం సురక్షితంగా గమ్యానికి చేరేలా చూడాలి. ఒక్క జాగ్రత్తతో ఓ కుటుంబాన్ని విషాదంలోంచి కాపాడవచ్చు.”





# రేషన్ దందా ఆగేదెప్పుడు

ఒకరు ప్రజల నుంచి బియ్యం సేకరిస్తు న్నారు. వాటిని పెద్దమొత్తంలో సేకరించి, తరలిస్తూ సొమ్ము చేసు కుంటున్నారు. సేకరించిన బియ్యానికి కిలోకు రూ.10వరకు కమీషన్ మిగులు తుండటంతో చాలా మంది దీనిని వృత్తిగా మలుచుకుంటున్నారు. నిత్యం రవాణా జరుగుతూనే ఉన్నా ఎప్పుడో ఒక్కసారి పట్టుబడటం గమనార్హం. ఇటీవలే త్రిపురాంతకం మండలంలో జిల్లా జాయింట్ కలెక్టర్, ఎన్ఫోర్స్మెంట్ అధికారులు తనిఖీలు చేయగా బియ్యం పక్కదారి పడినట్లు గుర్తించినా చర్యలు తీసుకోలేదు.

త్రిపురాంతకం మండల కేంద్రంలో బియ్యం ఇస్తామని స్లిప్పులు ఇచ్చారని, బియ్యం ఎప్పుడు ఇస్తారో తెలియడం లేదని అక్కడి కార్డుదారులు వాపోతున్నారు. ఇలా నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. కొన్ని సహోదరుల దుకాణాల్లో రేషన్ కు బదులుగా ఇతర నిత్యవసర సరకులు అంటగడుతూ వ్యాపారంగా మార్చుకుంటున్నారు.

**రవాణా ఇలా....**

ప్రభుత్వం సరఫరా చేసే బియ్యాన్ని తినేందుకు చాలా మంది ఇష్టపడటం లేదు. వీటిని వదిలి బహిరంగ మార్కెట్‌లో సన్నబియ్యం కొంటున్నారు. ఇంట్లో దొడ్డు బియ్యం తినడం లేదని మరికొంత మంది విక్రయిస్తున్నారు. సగటున కిలోకు రూ.10చొప్పున దళారులకు, ఇతరులకు అమ్ముతున్నారు. మరికొన్ని చోట్ల ఇంటింటికి తిరిగి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఇదే అదనుగా రేషన్ డీలర్లు, ఎండియు వాహనాలు ఆపరేటర్లు నిత్యవసర వస్తువులను దారి మళ్లిస్తూ ప్రజాధనాన్ని స్వాహా చేస్తున్నారు. పర్యవేక్షణ చేయాల్సిన రెవిన్యూ అధికారులు సైతం కిమ్మనకుండా ఉండడంతో ఈ వ్యాపారానికి అడ్డు అదుపు లేకుండా పోతుందని నిమర్శలు మండల వ్యాప్తంగా వినిపిస్తున్నాయి.

ప్రధానంగా మారుమూల పుల్లలు చెరువు మండలంలో రేషన్ బియ్యం కార్డుదారులకు సక్రమంగా అందిన దాఖలు లేవని చెప్పాలి. ఎండియు వాహనం ఎప్పుడు ఎటువైపు వెళుతుందో ఎటువైపు నుంచి వస్తుందో అర్థం కావడం లేదు అని కాదు పట్టుకుంటున్నారు. రేషన్ కార్డుదారుల నుంచి ఒక్కో కిలోకు 10 రూపాయల చొప్పున డబ్బులు ఇస్తూ రేషన్ బియ్యాన్ని వ్యాపారస్తులకు కట్టబెడుతూ రాత్రికి రాత్రే జిల్లాల సరిహద్దులను దాటిస్తున్నారు. ఈ తతంగంపై ఎన్ని మార్లు పత్రికల్లో వార్తలు వచ్చిన ఉన్నతాధికారులలో చలనం రాకపోవడం విశేషం. మండల పరిధిలోని ముఖ్య నాయకులే ఈ రేషన్ వ్యవహారంలో తలదూర్చి అంతా తామై వ్యవహరిస్తుండం తో ఈ వ్యాపారానికి అధికారులు కూడా అడ్డు చెప్పలేని పరిస్థితులు ఉన్నాయని తెలుస్తోంది. రాత్రి సమయంలో జరుగుతున్న ఈ రేషన్ దందాకు అడ్డుకట్ట పడుకుంటే ఈ నెలలోనూ పేదలకు నిత్యవసర సరుకులు అందేలా కనిపించడం లేదు. మరి జిల్లా అధికారులు ఏం చేస్తారో వేచి చూడాల్సి ఉంది.

# ప్రశాంతంగా ముగిసిన నీట్ పరీక్షలు



విద్యాలయము, దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కాలేజీలలో ఈ పరీక్షలు జరిగాయి. మొత్తం 1473 మంది అభ్యర్థులకుగాను 1428 మంది పరీక్షలకు హాజరైనట్లు పరీక్షల నిర్వహణ సిటీ కోఆర్డినేటర్ మనీష్ తెలిపారు. పరీక్షలకు హాజరవుతున్న అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యము కలుగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు, భద్రతాపరమైన చర్యలు చేపట్టారు. డి.ఆర్.ఆర్.ఎం. మున్సిపల్ హైస్కూల్ ను జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా తనిఖీ చేసి సదుపాయాలు, చెకింగ్, భద్రతా ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు.



# దివ్యాంగుడి బాధను తనదిగా భావించిన నేత

ప్రజల సమస్యలు తెలిసినా స్పందించని ఈ రోజుల్లో ఒక దివ్యాంగుడి బాధను తనదిగా భావించి, స్పందించిన ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మానవతా విలువలకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు. ప్రజలు ఆశిస్తున్న నాయకుడు అంటే ఇదే. అధికారంలో ఉన్నప్పుడు పదవిని కాదు....బాధ్యతను గుర్తెరిగి, ప్రజల ప్రాణాలకు తాకే మానవీయతతో స్పందించడం నిజమైన నాయకత్వానికి మారుపేరు. ప్రజలందరూ ఇలాంటి నాయకత్వాన్ని ఆశిస్తూ, ఆ దివ్యాంగుడి బాధ తీరే దిశగా ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.

# కోర్టు భవనాన్ని ప్రారంభించిన హైకోర్టు న్యాయమూర్తి తర్లాడ రాజశేఖర్‌రావు

జస్టిస్ డాక్టర్ వై లక్ష్మణరావు మాట్లాడుతూ శింగరాయకొండలో శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం చాలా ప్రసిద్ధి కలిగిందని, ఈ ప్రాంతం అంతా ప్రశాంతమైన వాతావరణం ఉంటుందన్నారు. ఇలాంటి ప్రాంతంలో ఏర్పాటు చేసిన కోర్టు కక్షిదారులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. జిల్లా కలెక్టర్









శ్రీమతి ఏ.తమీమ్ అన్సారియా, జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ మాట్లాడుతూ ఈ కోర్టు ద్వారా కేసులు త్వరగా పరిష్కారమై కక్షిదారులకు సత్వర న్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు సన్నె బోయిన శ్రీనివాసులు, ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని అన్ని కోర్టుల న్యాయమూర్తులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచి వచ్చిన న్యాయమూర్తులకు ఘనంగా సత్కరించారు. అదేవిధంగా హైకోర్టు న్యాయమూర్తులను జిల్లా జడ్జి ఏ భారతి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సన్నెబోయిన శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.









# సంపూర్ణ ఆరోగ్య సంరక్షణకు ప్రతి రోజూ పది వేల అడుగుల నడక అవసరం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 4)

శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో స్థానిక రంగారాయుడు చెరువు వాకింగ్ ట్రాక్ మీద ఆదివారం ఉదయం ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందని శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ , ప్రముఖ ఎముకలు, కీళ్ల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చాపల వంశీకృష్ణ తెలిపారు. ప్రతి నెల మొదటి ఆదివారం ఉదయం రంగా రాయుడు చెరువు మీద గాంధీ విగ్రహం వద్ద జరిగే ఈ వైద్య శిబిరంలో భాగంగా ఆదివారం జరిగిన ఈ వైద్య శిబిరంలో సుమారు 250 మందికి ఉచితంగా బిపి ,షుగర్, హెచ్ బి , పల్సాక్షి మీటర్ పరీక్షలు , పాదాల నరాల స్పర్శ పరీక్ష ఉచితంగా నిర్వహించారు. ప్రముఖ జనరల్ మెడిసిన్ , డయాబెటాలజిస్ట్ డాక్టర్ సానల ధీరజ్ బాబుచే తగిన వైద్య సలహాలు, సూచనలు అందజేసారు.

డాక్టర్ సానల ధీరజ్ బాబు మాట్లాడుతూ సంపూర్ణ శారీరక, మానసిక ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ రోజూ పది వేల అడుగులు నడవాలని సూచించారు. అలాగే షుగర్ ను ఎలా నియంత్రించుకోవాలి, ఆహార సమతుల్యత ఎలా పాటించాలి అనే విషయాలపై అవగాహన కల్పించారు. ప్రతిరోజు 45 నిమిషాలు వ్యాయామం చేయడం వలన శారీరక, మానసికంగా ఆరోగ్యకరంగా ఉండవచ్చని,వ్యాయామం ఎక్కువగా కండరాలను, రక్త ప్రసరణ వ్యవస్థను మెరుగు పరచడానికి, అధిక బరువు తగ్గించుకోవడానికి, మానసిక ఉల్లాసం పెంపొందించుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. అలాగే క్రమం తప్పకుండా చేసే వ్యాయామం వలన మన శరీరపు వ్యాధినిరోధక శక్తి పెంపొందుతుందన్నారు. గుండెకు సంబంధించిన వ్యాధులు, స్థూలకాయం, మధుమేహం వంటి వ్యాధులు రాకుండా నిరోధిస్తుందని తెలియజేశారు. ప్రతినెల మొదటి గురువారం శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నందు అన్ని మల్టీ స్పెషాలిటీ వైద్య సేవలకు ఉచితంగా ఓపి, బిపి షుగర్, ఈసీజీ, థైరాయిడ్ పరీక్షలు, గర్భిణీ స్త్రీలకు స్కానింగ్, ఎముకల పట్టుత్వ సాంద్రత పరీక్ష , ,ఊపిరితిత్తుల సామర్థ్యపు పరీక్ష , యూరిక్ ఆసిడ్ ,పాదాల నరాల స్పర్శ పరీక్ష ఉచితంగా చేయబడును అని తెలియజేశారు. ప్రకాశం జిల్లా ప్రజలు ఈ వైద్య సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ కొప్పోలు సామిత్ర పల్లవ్, జనరల్ మేనేజర్ బైరెడ్డి ప్రవీణ్ కుమార్ ,మార్కెటింగ్ మేనేజర్ షేక్ ఖాసిం సైదా మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ గోపి, అనిల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.





# పట్టణ టిడిపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంను ప్రారంభించిన ఎమ్మెల్యే ఇంటూరి

## చలివేంద్రం ఏర్పాటు చేసిన పట్టణ టిడిపి నాయకులను అభినందించిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, మే 4)

వేసవికాలం దృష్ట్యా ప్రజల కోసం పట్టణ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పామూరు రోడ్ ఎన్టీఆర్ జంక్షన్ వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రం ను ఆదివారం ఉదయం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవికాలం దృష్ట్యా ప్రజల కోసం పట్టణ టిడిపి ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమని తెలిపారు.. పట్టణ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో భవిష్యత్తులో మరిన్ని మంచి సేవా కార్యక్రమాలు చేయాలని పట్టణ పార్టీ కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే సూచించారు. చలివేంద్రం ప్రారంభించిన తర్వాత ఏర్పాటు చేసిన మజ్జిగను ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రజలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, పట్టణ టిడిపి మాజీ అధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు, ముచ్చు శ్రీను పార్టీ నాయకులు చిలకపాటి మధుబాబు, షేక్ రఫీ, బెజవాడ ప్రసాద్, వడ్డెళ్ళ రవిచంద్ర అత్తంటి శ్రీహరి నాయుడు, ముచ్చు వేణు, చుండూరి శ్రీను, మోదడుగు వెంకటేశ్వర్లు, కొత్తూరి వెంకట సుధాకర్, చీదెళ్ల వేణు, పున్నం వీరాస్వామి, మేడ మల్లికార్జున, ఉన్నం కొండలరావు, పీలా శ్రీను, ముప్పవరపు వేణు అత్తింటి శివకృష్ణ , ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.





# శావల్యాపురం మండలంలో పెన్షన్ల తొలగింపు అవాస్తవం

## వైసీపీ నాయకుల దుష్ప్రచారం ఆపాలి

## పెన్షన్ లపై విచారణ జరుగుతుంది

## వైసీపీ వాళ్లు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి

## టీడీపీ నేతలు




(షణ్ముఖ వెలుగు, వినుకొండ, మే 4)

వినుకొండ నియోజకవర్గం లో శావల్యాపురం మండలంలో పెన్షన్ల తొలగింపు అంటూ వైసీపీ చేస్తున్న ప్రచారం అవాస్తమని, వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గుంటూరు సాంబశివరావు, విశ్వనాథం, టిడిపి నాయకులు ఆదివారం ఖండించారు. పెన్షన్లు తొలగించారంటూ వైసీపీ నాయకులు ఎంపీడీవో కార్యాలయం వద్ద చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని అన్నారు. కొత్తలూరు గ్రామంలో 30 పెన్షన్లు తొలగించారని చెప్పడం పచ్చి అబద్ధమని, 5 వికలాంగుల పెన్షన్ల పై విచారణ జరుగుతుందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం వచ్చి సంవత్సరం గడుస్తున్న నేటి ఒక్క పెన్షన్ కూడా తొలగించలేదన్నారు. వికలాంగుల పెన్షన్లలో అనర్హులు ఉన్నారని ప్రభుత్వం చేస్తున్న విచారణలో భాగంగా మండలం మొత్తం 489 పెన్షన్ లపై విచారించడం జరిగిందని, దానిలో 94 పెన్షన్లను జిజిహెచ్ నుండి వచ్చిన వైద్య అధికారులు పెండింగ్లో పెట్టి విచారిస్తున్నట్లు తెలిపారు. పొట్లూరు, పిచికల పాలెం, కొత్తలూరు మొత్తం 15 పంచాయతీల్లో పెన్షన్ తొలగించారని వైసిపి తప్పుడు ప్రచారం చేయడం దుర్మార్గమన్నారు. పేదల పెన్నిధి ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పెన్షన్లు తొలగింపు అనేది సహించడని, ఇప్పటివరకు ఒక్క పెన్షన్ కూడా తొలగించడం జరగలేదన్నారు. వైసిపి ప్రభుత్వంలో అర్హులైన అమాయకులకు పార్టీని ఆపాదించి పెన్షన్లు, 18000 చేయూత పథకం తొలగించడం ఇలాంటి దుర్మార్గాలకు పాల్పడింది వైసిపి నాయకులని వారు గుర్తు చేశారు. పెన్షన్లు తొలగింపు అంటూ వైసీపీ తప్పుడు ప్రచారం చేయటం మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో ఎర్రమాస్ కోటేశ్వరరావు, గద్దె మస్తాన్‌రావు, బోడిపుండి నాగేశ్వరరావు, వెంకట్ నారాయణ, సాదినేని కృష్ణ, పారా చౌదరి, మురళి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# ప్రపంచ సంగీత చరిత్రలో కర్ణాట సంగీతానికి సముచిత స్థానం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 4)

ప్రపంచ సంగీత చరిత్రలో త్యాగరాజ స్వామి కర్ణాట సంగీతానికి సమున్నతమైన స్థానం ఉందని ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకులు, ప్రకాశం జిల్లా రచయితల



సంఘం అధ్యక్షులు పొన్నూరు వేంకట శ్రీనివాసులు అన్నారు. త్యాగరాజ స్వామి జయంతి సందర్భంగా మంగమూరు రోడ్ లోని గాయత్రి అమ్మవారి మందిరంలో శ్రీ త్యాగరాజ సేవా సమితి వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పొన్నూరు వేంకట శ్రీనివాసులు "త్యాగరాజ స్వామి జీవితం - కృతుల పరమార్ధం" అనే అంశంపై ప్రసంగించారు. సంగీత జ్ఞానానికి భక్తికి మించిన సాధన లేదని నమ్మి నాదోపాసన ద్వారా రాముడిలో ఐక్యమైపోయిన తెలుగు వాగ్గేయకారుడు త్యాగరాజ స్వామి అని అన్నారు. త్యాగరాజ స్వామి పూర్వికులు ప్రకాశం జిల్లా కాకర్లకు చెందిన వారు కావటం జిల్లా చేసుకున్న అదృష్టంగా అభివర్ణించారు. 24 వేల కృతులను రచించి సంగీతానికే దిశా నిర్దేశం చేశారని అన్నారు. వారి జీవితంలోని మధురమైన ఘట్టాలను, కృతులలోని పరమార్ధాలను తన ప్రసంగం ద్వారా రస రమ్యంగా పలికించి ప్రేక్షకుల కరతాల ధ్వనులు అందుకున్నారు. సంస్థ అధ్యక్షులు పిన్నంరాజు నరసింహారావు, సభ్యులు ఉపన్యాసకులు పొన్నూరు వేంకట శ్రీనివాసులును ఘనంగా సత్కరించారు. అనంతరం వసుంధర, నాగలక్ష్మి, మానసి, ప్రవల్లిక, దేవసేన వీణానాదం అలరించింది. త్యాగరాజస్వామి ఆరాధన జయంతి మహోత్సవాలను ఘనంగా నిర్వహించిన నిర్వాహకులను పలు అభినందించారు.

# నగరంలోని నిరుపేదలకు ఉన్నత స్థాయి విద్య అందించటమే ధ్యేయం

## విఆర్ సి స్కూల్‌ను పునః ప్రారంభం

## రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ





(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 4)

ఆదివారం సాయంత్రం మంత్రి నారాయణ వి ఆర్ సి పాఠశాల పునర్నిర్మాణపనులను కమిషనర్ నందన్ తో కలిసి పరిశీలించారు. అన్ని తరగతి గదులను పరిశీలించి తగు సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ విద్యార్థుల ఆటపాటలకు అనుకూలంగా గ్రౌండ్ లో ఉన్నటువంటి పాత శిధిలమైన భవనాలను తొలగించి మైదానాన్ని నిర్మించాలని ఆదేశించామన్నారు. నెల్లూరు నగర నడిబొడ్డులో మూడు షిఫ్టుల్లో 8 వేలకు పైగా విద్యార్థులు చదువుకున్న ప్రతిష్టాత్మక కాలేజీని గత ప్రభుత్వ నిర్వాహకులు నిర్వీర్యం చేశారన్నారు. గత ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన విధంగా పాఠశాల ను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి నగరంలోని పేదలు, నిరుపేదలకు ఉన్నత స్థాయి విద్యను అందిస్తామన్నారు. పునర్నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. అన్ని పనులు అనుకున్న విధంగా పూర్తిచేసి వచ్చే విద్యా సంవత్సరం పాఠశాలలు ప్రారంభించే నాటికి పూర్తిస్థాయిలో సిద్ధం చేస్తామన్నారు. మొదటి సంవత్సరంలో వేయి మంది పేదలకు అడ్మిషన్స్ కల్పిస్తామని, ఉచిత బస్సు, భోజన వసతితో పాటు సాయంకాలం ఆటపాటల అనంతరం స్నాక్స్ అందించి వారి ఇళ్ల వద్ద దించుతామన్నారు ఆవిధంగా వచ్చే విద్యా సంవత్సరం పేదల అడ్మిషన్లు రెండు వేలకు పెంచుతామన్నారు.

# గెలుపోటములు కాదు క్రీడల్లో పాల్గొనడమే ముఖ్యం

నేనూ క్రీడాకారుడినే
వాలీబాల్, కబడ్డీ ఆడను...
సాఫ్ట్ బాల్ తోనూ పరిచయం ఉంది
మహిళలు క్రీడామైదానంలో పోరాట స్ఫూర్తితో
రాణిస్తున్న తీరు అందరికీ ఆదర్శం
జాతీయ అంతర్ యూనివర్సిటీ మహిళల సాఫ్ట్ బాల్ టోర్నమెంటు ముగింపు
వేడుకలో రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు







(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 4)

కొల్హాపూర్ శివాజీ యూనివర్సిటీ, పంజాబ్ లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్ ను ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు ఎంపీ మస్తాన్ రావు, యూనివర్సిటీ వీసీ అల్లం శ్రీనివాసరావు, పద్మావతి మహిళా యూనివర్సిటీ వీసీ ఉమా, వి.ఎస్.యూ రిజిస్ట్రార్ సునీత, ప్రిన్సిపల్ విజయ తదితరులు. విజేత జట్లకు అధికారిక ట్రోఫీలతో పాటు సొంతంగా నగదు బహుమతులు, టోర్నీలో రాణించిన వారందరికీ జ్ఞాపికలు అందజేసి సత్కరించారు బిఎంఆర్. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పొదలకూరులో మంత్రి సత్యకుమార్ తో కలిసి దయాలసిస్ సెంటర్ ప్రారంభోత్సవంలో పాల్గొనాల్సివున్నందున ఈ కార్యక్రమ బాధ్యతను నాకు అప్పజెప్పారు. ఒక జాతీయ స్థాయి కార్యక్రమానికి రావడం చాలా ఆనందం కలిగించిందన్నారు. 29 రాష్ట్రాల నుంచి 60 యూనివర్సిటీలకు సంబంధించిన సాఫ్ట్ బాల్ జట్లు ఈ పోటీల్లో పాల్గొనడం సంతోషమన్నారు. నేనూ విద్యార్థి దశలో వాలీబాల్, కబడ్డీ క్రీడాకారుడిని. 15 ఏళ్ల వయస్సులో మా స్కూలు సాఫ్ట్ బాల్ జట్టులో ఒక క్రీడాకారుడు రాకపోవడంతో నాకు ఆడే అవకాశం ఇచ్చారు. 50 ఏళ్ల తర్వాత మళ్లీ ఈ రోజు విక్రమ సింహపురి యూనివర్సిటీలో సాఫ్ట్ బాల్ ఆడే అవకాశం లభించింది. జాతీయ స్థాయిలో నెల్లూరు ఒక ఆసక్తికర ప్రదేశంమా నెల్లూరుకు వచ్చిన వారు తప్పనిసరిగా ఇక్కడ స్పెషల్ అయిన చేపల పులుసు రుచిని ఆస్వాదించి వెళ్లాల్సిందే. నా వంతుగా క్రీడాకారులకు వడ్డించేందుకు రొయ్యలు పంపుతాను. వెనామీ రొయ్యలను 2011లో మా బీఎంఆర్ కంపెనీ ద్వారా రైతులకు పరిచయం చేశామని చెప్పడానికి చాలా సంతోషిస్తున్నాను. ఈ రోజు మన దేశానికి 7 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని వెనామీ రొయ్యలు అందిస్తున్నాయి. మెరైన్ బయాలజీ విభాగం విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించేందుకు విక్రమ సింహపురి యూనివర్సిటీతో మా బీఎంఆర్ కంపెనీకి ఎంఓయూ కూడా ఉందన్నారు.



## పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



(షణ్ముఖ వెలుగు, పొదిలి, మే 4)

పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మీగడ ఓబుల్‌రెడ్డి అన్నారు. ఆదివారం గ్రామ పార్టీ అధ్యక్షుడు, బూత్ కన్వీనర్లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో పార్టీ పటిష్టతకు సమిష్టిగా పని చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కంభాలపాడు గ్రామ పార్టీ అధ్యక్షుడిగా ఆవులూరి కోటప్ప నాయుడు, బూత్ కన్వీనర్లుగా బత్తిన ఓబయ్య, సురేష్, చెన్నకేశవులు, బ్రహ్మానాయుడు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మీగడ ఓబుల్‌రెడ్డి, తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి ఆవులూరి యలమంద, ఏలూరి సొసైటీ అధ్యక్షుడు ఉలవా గోపి, మండల ప్రధాన కార్యదర్శి కాటూరి శ్రీను, మాదాలవారిపాలెం సొసైటీ అధ్యక్షుడు యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, తానికొండ వెంకట్రావు, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ గౌస్ భాష, తదితరులు పాల్గొన్నారు.

## ప్రాంగణ ఎంపికలలో 97 మంది శ్రీ హర్షిణి విద్యార్థులు ఎంపిక



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 4)

శ్రీహర్షిణి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఆదివారం టాటా కంపెనీ, ఏసీఈ అకాడమి వారి ప్రాంగణ ఎంపికలు జరిగాయి. ఈ ఎంపికలలో టాటా ఐటి కంపెనీలో రూ.3 లక్షల ప్యాకేజీతో మొత్తం 30 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. టాటా నాన్ ఐటి లో రూ.2.3 లక్షల ప్యాకేజీతో 48 మంది ఎంపికయ్యారు. ఏసీఈ అకాడమీలో 2.4 లక్షల ప్యాకేజీ తో 19 మంది ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ గోరంట్ల రవికుమార్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కేవలం డిగ్రీ మాత్రమే కాకుండా డిగ్రీతో పాటు క్యాంపస్ ప్లేస్మెంట్స్ ను కూడా నిర్వహిస్తున్న ఏకైక విద్యాసంస్థ శ్రీ హర్షిణి అని తెలియజేశారు. దీనికి కారణం కళాశాల స్థాపించిన మొదటి సంవత్సరం నుండి కేవలం డిగ్రీ మాత్రమే కాకుండా డిగ్రీ చేరిన విద్యార్థికి కాంపిటేటివ్ ఎగ్జామ్స్ దృష్టిలో ఉంచుకొని, క్యాంపస్ ప్లేస్మెంట్స్ కు కావలసిన అర్థమెటిక్, రీజనింగ్, సాఫ్ట్ స్కిల్స్ మొదటి సంవత్సరం నుండి డిగ్రీ విద్యార్థులకు ఉచితంగా నేర్పించడం జరుగుతుంది అని తెలియజేశారు. ఎంపిక కాబడిన విద్యార్థినీ విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ శ్రీ గోరంట్ల కవిత, ప్రిన్సిపల్ దాది ఆంజనేయులు, పీజీ కోఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి, ఏవో ర్యాంకర్ శ్రీనివాసరావు, క్యాంపస్ ఇంచార్జ్ ధీరేష్, ఇతర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

## ద్విచక్ర వాహనం పై హెల్మెట్ లేకుండా బైక్ నడిపితే కఠిన చర్యలే ఎస్ ఐ అనుక్



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, మే 4)

స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో ఆదివారం ఎస్ఐ అనుక్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనంపై వెళ్లేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సి, ఇన్సూరెన్స్, ఉండాలని, 18 సంవత్సరాలు నిండకుండా వాహనాలు నడిపినట్లయితే కఠిన చర్యలు తప్పవని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది వాహనదారులు పాల్గొన్నారు.

## ఉమ్మడి నెల్లూరు జిల్లాలో పిడుగుపాటుకు ఇద్దరు మృతి

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 4)

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఆదివారం మధ్యాహ్నం నుంచి ఒక్కసారిగా వాతావరణం మారి ఈదురు గాలులు వేయటం, అందులో కొన్ని మండలాల్లో పిడుగుపాటు వర్షాలు పడడంతో ఇద్దరు మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. నాయుడుపేట, ఓజిలి మండలాలు పిడుగుపాటుకు ఇద్దరు మృతి చెందారు. ఓజిలి మండలం గొట్లపాలెం వద్ద మామిడి తోటలు పనిచేస్తున్న కార్తీక్ అనే వ్యక్తి మృతి చెందారు. నాయుడుపేట మండలం వద్దిగుంట కండ్రిక వద్ద ఆలం భాస్కర్ అనే రైతు పిడుగుపాటుకు గురై ఆదివారం మృతి చెందారు. జిల్లాలో ఇద్దరు పిడుగుపాటుకు మృతి చెందడంతో వారిని విని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం తరఫున తగిన పారితోషకం అందించి ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



# టెంకాయ చెట్లపాలెంలో శ్రీ సీతారాముల స్వామి వారి కళ్యాణం

- లక్ష్మమ్మ జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి - ఘన స్వాగతం పలికిన గ్రామస్తులు, పార్టీ నాయకులు

కబడ్డీ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే ఇంటూరి

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 4)

మండలంలోని కరేడు పంచాయతీ టెంకాయచెట్లపాలెం గ్రామంలో గ్రామస్తుల ఆహ్వానం మేరకు శనివారం రాత్రి శ్రీ సీతారాములు వారి కళ్యాణం, లక్ష్మమ్మ జాతరలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా శ్రీ సీతారాముల స్వామి వారి కళ్యాణ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గారికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం అక్కడ జరుగుతున్న కబడ్డీ పోటీలను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.









# ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు పున: ప్రారంభం

# కాపు ఉద్యోగ సంఘాల నాయకులు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 4)

కాపు ఉద్యోగులతోపాటు విద్యార్థులకు, విశ్రాంత ఉద్యోగులకు తోడ్పాటుగా ఉండేందుకే 2014లో కాపు ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేయటం జరిగిందని సుదీర్ఘకాలం పనిచేసిన తర్వాత కొన్ని అనివార్య కారణాలతో సంఘం కార్యకలాపాలు కొంతవెనకబడ్డాయని ,తిరిగి పునరావృతం చేసేందుకు సంఘ కార్యకలాపాలను వేగవంతం చేసేందుకు నూతన కమిటీని ఎంపిక చేయటం జరిగిందని కాపు ఉద్యోగ సంఘాల నాయకులు తెలిపారు. ఈ సంఘం ఏ సంఘాలకు కాని, కులాలకు వ్యతిరేకం కాదని, ఏ రాజకీయ పార్టీలకు సంబంధం లేదని కేవలం కాపు ఉద్యోగులు, విద్యార్థులు, కాపు సంఘస్తులకు తోడ్పాటుగా ఉండేందుకే సంఘాన్ని ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. కాపు కల్యాణ మండపంలో కాపు ఎంప్లాయీస్ కన్వీనర్ వీరప్రతాప్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ కార్యకలాపాలు నిర్వహించేందుకు నూతన కమిటీని ఎంపిక చేసుకోవటం జరిగింది. నూతన కమిటీని %ూా% కమర్షియల్ టాక్స్ స్టేట్ జనరల్ సెక్రటరీ కొప్పోలు సుధాకర్ ప్రకటించారు. నూతన కార్యవర్గానికి ఏపీ విద్యుత్ సర్వీసెస్ జనరల్ సెక్రటరీ తంగా సాంబశివరావు, ఏపీ స్టేట్ మెడికల్ ఎంప్లాయీస్ జాయింట్ సెక్రెటరీ వరదా కృష్ణా రావు, సంఘం వ్యవస్థాపకులు జేష్ఠ వరప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ నారిశెట్టి రామ మోహనరావుల మద్దతు తెలిపారు. నూతన అధ్యక్ష కార్యదర్శులుగా కొల్లా సుఖదేవ్, సుంకర తిరుమల నాయుడు, ట్రెజరర్‌గా పెద్దిశెట్టి సుబ్బారావును, వైస్ ప్రెసిడెంట్ల్ గా సిరిగిరి రామచంద్ర, వాసాల ప్రసన్నకుమార్, సిరిగిరి శ్రీనివాసరావు , జి ఆంజనేయులు, సాదు నరసింహారావు, జాయింట్ సెక్రెటరీలగా బ్రహ్మయ్య నాయుడు , సోమశేఖర్ , నిశంకం బ్రహ్మయ్య , రమేష్ లు , ఆర్గనైజింగ్ సెక్రటరీగా జి శ్రీనివాసరావు , మహిళా ప్రతినిధి గా పసుపులేటి అనురాధ ఎన్నికచేశారు. అడ్వైజరీ కమిటీలో చిట్టెం వెంకటేశ్వర్లు, పసుపులేటి మారుతి ప్రసాద్, దండే వెంకటేశ్వరరావు, కొల్లా హనుమంతరావులను ఎంపిక చేసినట్లు నిర్వహకులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కాపు రాక్స్ ప్రకాశం అడ్మిన్ కె.రామ మోహన రావు, వివిధ కాపు ఉద్యోగ ఉపాధ్య సంఘాలు, కాపు రిటైర్డ్ ఎంప్లాయీస్, కాపు నాయకులు జిల్లా నలుమూలల నుండి విచ్చేసి కమిటీకి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలియచేసి, నూతన కమిటీకి అభినందనలు తెలియచేశారు. ఈ సందర్భంగా కొప్పోలు సుధాకర్ మాట్లాడుతూ కాపు ఉద్యోగుల సమస్యలను సామరస్యంగా పరిష్కార దిశగా కాపు ఉద్యోగుల వెల్ఫేర్ సంఘం పనిచేయాలని తెలిపారు. నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ కాపు కులస్థుల సంక్షేమం కోసం నూతన కార్యవర్గం పనిచేస్తుందన్నారు. కాపు ఉద్యోగుల సంఘంలో మొదటి నుంచి కార్యవర్గ సభ్యులుగా కొనసాగుతూ నేడు నూతన అధ్యక్ష కార్యదర్శులుగా బాధ్యతలు చేపట్టామన్నారు. జిల్లాలో కాపు ఉద్యోగులకు ఎటువంటి సమస్య తలెత్తినా వారికి సంఘం అండగా ఉంటుందనే భరోసా కల్పించేలా నూతన కార్యవర్గం పనిచేస్తుందన్నారు. ఎవరికైనా ఏదైనా పనిఉన్నప్పుడు ఏప్రభుత్వ కార్యాలయంలో కలిస్తే ఆసమస్యకు పరిష్కారం దొరుకుతుందో తెలియజేసి ఆసమస్య పరిష్కారం చేసేలా సంఘం అండగా ఉంటుందన్నారు. కాపుసంఘంలోని ఉద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగులకు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, విద్యార్డులకు అన్ని విధాలుగా అండగా ఉండేందుకు తొలి అడుగుగా సంఘం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.




## ఉలవపాడు శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 4)

ఉలవపాడు శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా ఆదివారం విద్యార్థులతో ముందుగా నీతి కథలు, జాతీయ నాయకుల జీవిత చరిత్రలు, విజ్ఞానదాయకమైన పుస్తకాలు చదివించి అనంతరం లెమన్ స్పూన్ పోటీలు నిర్వహించారు. చివరిగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో పిల్లలకు కూల్ డ్రింక్స్ అందజేయడం జరిగినది. ఎక్కువ మంది పిల్లలను గ్రంథాలయానికి పంపిస్తున్న వారి తల్లిదండ్రులకు గ్రంధపాలకుడు డి కోటేశ్వరరావు కృతజ్ఞలు తెలియజేశారు. హాజరైన 26 మంది విదార్థులలో 10 మంది సభ్యత్వం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీ భాస్కర్ రాజా పాల్గొన్నారు.

## జిల్లా కేంద్ర గ్రంధాలయంలో 6వ రోజు వేసవి విజ్ఞాన తరగతులు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 4)

జిల్లా కేంద్ర గ్రంధాలయం ఒంగోలు నందు (ఆదివారం) న వేసవి విజ్ఞాన తరగతులలో భాగంగా 6వ రోజు కార్యక్రమాలకు 58 మంది విద్యార్థులు హాజరయ్యారు. వేసవి శిక్షణా శిబిరం 6వ రోజు కార్యక్రమంలో స్టోరీ టెల్లింగ్ , ధ్యానం- కాశీ విశ్వనాథ్ పిల్లలకు పంచతంత్రం కథలు చెప్పటం, పుస్తకాలు చదివించడం జరిగింది. అనంతరం పిల్లలచే ధ్యానం చేయించి, ధ్యానంపై మెళకువలు నేర్పించారు. స్పోకెన్ ఇంగ్లీషు-గ్రామర్‌లో గురించి పిల్లలకు వి.వెంకయ్య బేసిక్స్ , అడ్వాన్స్డ్ ఇంగ్లీష్ బోధించటం జరిగింది. యోగా క్లాస్- టి.శ్రీనివాసరావు పిల్లలతో యోగాసనాలు చేయించటం జరిగింది. క్రాఫ్ట్, లూసిడా హ్యాండ్ రైటింగ్ నందు ఆర్. బిందుమణి క్రాఫ్ట్ నందు పిల్లలకు చిన్న చిన్న వస్తువులు పేపర్‌తో తయారు చేసి చూపించి, పిల్లలతో చేయించారు. అనంతరం ఫోనిక్ సౌండ్ గురించి నేర్పించారు. జాలాది మోహన్, కవి, వ్యక్తిత్వ వికాసకులు, పర్సనాలిటీ డెవలప్మెంట్ పై పిల్లలకు అవగాహన కల్పిస్తూ మోటివేషన్ విషయాలు తెలియజేసారు. టి రవీంద్ర, శిరీష సృష్టి ఆర్ట్స్ అకాడమీ వారు చిత్రలేఖనం నందు రకరకాల వస్తువులు. వ్యక్తులకు సంబంధించిన చిత్రాలు గీయటం నేర్పించారు. ఉప గ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి మాట్లాడుతూ ఆదివారం వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులు దుర్గ పాల్గొని విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందినందుకు ఈ శిబిరం ఎంతో దోహదపడాటుతుందని, విద్యార్థులు చురుకుగా పాల్గొని సృజనాత్మక దృష్టితో సమయాన్ని సద్వి సద్వినియోగం చేసుకోవాలని, పిల్లలు వేసవి సెలవుల సమయాన్ని వృధా చేసుకోకుండా గ్రంథాలయం నకు వచ్చి పుస్తకాలు చదవటం, అలాగే ఈ వేసవి శిక్షణా శిబిరంలో రిసోర్స్ పర్సన్స్ ద్వారా కొత్త కొత్త విషయాలు నేర్చుకోవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన 250 మందికి వైద్య పరీక్షలు





(షణ్ముఖ వెలుగు, పొదిలి, మే 4)

పట్టణంలోని ఆలూరి కంటి వైద్యశాల వైద్యులు పి ఖాజావలి ఆధ్వర్యంలో ఆదివారం రాయల్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యురాలు మన్నెం నాగ సుధామణి హాజరై కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారు 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 110 మందికి ఆపరేషన్ అవసరమైనట్లు నిర్ధారించారు. మిగిలిన వారికి అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. ఆపరేషన్లు అవసరమైన వారి రాయల్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నందు ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయడం జరుగుతుందన్నారు. ఆపరేషన్ అవసరమైన వారిని తమ సొంత వాహనాల్లో ఒంగోలు తీసుకుని వెళ్ళి ఆపరేషన్ చేసిన అనంతరం తిరిగి పొదిలికి చేర్చడం జరుగుతుందన్నారు. కావున ఆపరేషన్లు అవసరమైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# అంగరంగ వైభవంగా శ్రీ అంకమ్మ తల్లి ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ట

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 4)

వరికుంటపాడు మండలం పెద్దిరెడ్డిపల్లిలో శ్రీ అంకమ్మ తల్లి ఆలయ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పాల్గొన్నారు. నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీలు బీద రవిచంద్ర, కంచర్ల శ్రీకాంత్, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, ప్రజా ప్రతినిధులకు ఆలయం మర్యాదలతో ఘన స్వాగతం పలికిన వేద పండితులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. నెల్లూరు, ప్రకాశం జిల్లాల మధ్యలో ఉన్న పెద్దిరెడ్డిపల్లి అంకాలమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణ, విగ్రహ ప్రతిష్ట మహత్కార్యంలో పాల్గొనడం అదృష్టం, పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని మంత్రి ఆనం తెలిపారు. అంకాలమ్మ తల్లి ఆశీస్సులతో బాగా అభివృద్ధి చెంది, సొంత గ్రామంలో ఆ తల్లి ఆలయ పునర్నిర్మాణానికి ముందుకొచ్చిన గ్రామస్తులు, దాతలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రతిపాదనల మేరకు అంకాలమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో ఎటువంటి అరిష్టాలు లేకుండా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రజలందరూ సకల సంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ తల్లి చల్లని దీవెనలు అందరిపై మెండుగా ఉండాలని ఆ అమ్మను వేడుకున్నానని మంత్రి ఆనం తెలిపారు.







# తాగి వేధిస్తున్నాడని భర్తను హత్య చేసిన భార్య ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం

### పోలీసుల అదుపులో నిందితురాలు

(షణ్ముఖ వెలుగు, కంభం, మే 4)

తరచు మద్యం తాగి వచ్చి తనను వేధిస్తున్నాడని భర్తను భార్య హత్య చేసిన ఘటన కంభం పట్టణంలోని స్థానిక కాపు వీధిలో చోటుచేసుకుంది. శనివారం ఫుల్లుగా మద్యం తాగి వచ్చిన షేక్ వలి (45) భార్యతో గొడవ పెట్టుకుని చంపేందుకు ప్రయత్నించాడు. కోపంతో ఊగిపోయిన భార్య రిజ్వాన భర్త మెడకు టవల్ బిగించి హతమార్చింది. తర్వాత నిందితురాలు భర్తది సహజ మరణంగా చిత్రీకరించేందుకు ప్రయత్నించింది. పోలీసుల విచారణలో రిజ్వాన హత్య చేసినట్లు గుర్తించి ఆదివారం పోలీసులు నిందితురాలిని అదుపులకి తీసుకున్నారు. సంఘటనా స్థలానికి మార్కాపురం డిఎస్పీ నాగరాజు, కంభం సీఐ మల్లికార్జున, కంభం ఎస్ఐ నరసింహారావు చేరుకుని పరిశీలించారు. ఈ సందర్బంగా మార్కాపురం డిఎస్పీ నాగరాజు మాట్లాడుతూ విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.








## 7న మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీడీవో ఎన్ విజయ

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 4)



ఉలవపాడు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని సమావేశపు హాల్లో మే 7వ తేదీన మధ్యాహ్నం 2:00 గంటలకు మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు వాయల మస్తానమ్మ అధ్యక్షతనలో సమావేశం నిర్వహించుట కోసం నిర్ణయించబడినది. కావున మండల పరిషత్ ప్రాదేశిక సభ్యులు, మండల కోఆప్షన్ సభ్యులు, జిల్లా పరిషత్తు ప్రాదేశిక సభ్యులు, మరియు ప్రత్యేక ఆహ్వానితులైనటువంటి గ్రామపంచాయతీ సర్పంచులు, సదరు సర్వసభ్య సమావేశమునకు హాజరు కావలసిందిగా కోరడమైనది. అదేవిధంగా మండల పరిధిలోని మండల స్థాయి అధికారులు అందరూ వారి వారి శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలు సమావేశమునకు 3 రోజుల ముందుగా అందజేయవలసింది గాను మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంనకు తప్పనిసరిగా హాజరు కావలసినదిగా ఆదేశిస్తున్నట్లు ఎంపీడీవో ఎన్. విజయ ఒక ప్రకటనలో తెలియజేశారు.

# ఎన్ని కష్టాలు వచ్చినా జగన్మోహన్ రెడ్డిని వదిలే ప్రసక్తే లేదు

## కాకాణి పై అక్రమ కేసులు బనాయించి, ఇబ్బందులు పెట్టాలని చూస్తున్నారు
## మీడియా సమావేశంలో మాజీ మంత్రి, పార్టీ పీఏసీ మెంబర్ పి అనిల్ కుమార్ యాదవ్

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 4)

ఎన్ని కష్టాలు వచ్చినా జగన్మోహన్‌రెడ్డిని వదిలే ప్రసక్తే లేదని మాజీ మంత్రి, పార్టీ పిఏసి మెంబర్ పి అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. వైసీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైదాపురం మండలంలో జరుగుతున్న క్వార్జ్ అక్రమ రవాణా సంబంధించి తీవ్రంగా ధ్వజమెత్తారు.ఎన్నికలైన తర్వాత గత 10 నెలల కాలంలో వ్యక్తిగత పనుల నేపథ్యంలో కొంత దూరంగా ఉండడం జరిగిందన్నారు. ఈ కాలంలో చాలామంది చాలా రకాలుగా తన పై ప్రచారం చేశారన్నారు. అనిల్ రాజకీయాలకు దూరంగా ఉన్నాడు, కష్టకాలంలో పార్టీని వదిలేశాడు, జగన్మోహన్ రెడ్డికి అండగా నిలబడలేదు అనే వదంతులు ప్రచారం చేయడం జరిగిందన్నారు. పార్టీ పట్ల నా చిత్తశుద్ధి ఏమిటో మా పార్టీ అధినాయకుడు వైయస్ జగన్మోహన్‌రెడ్డికి తెలుసు, ఎన్ని కష్టాలు వచ్చినా జగన్మోహన్ రెడ్డిని వదిలే ప్రసక్తే లేదన్నారు. ఎన్నికల తర్వాత రెండు మూడు నెలల పాటు అనిల్ కుమార్ యాదవ్ క్వార్జ్ దోచేసారని, వేల కోట్లు సంపాదించుకున్నారని నా మీద అనేక వదంతులు ప్రచారం చేసినప్పటికీ మౌనంగా ఉన్నానని చెప్పారు. జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డిపై కూడా అక్రమ కేసులు బనాయించి, ఇబ్బందులు పెట్టాలని చూస్తున్నారు. ప్రతి ఒక్కరికి తమ నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవడానికి న్యాయస్థానాన్ని ఆశ్రయించే హక్కు ఉంటుంది. అదే విధంగా మా అధ్యక్షులు వారు కూడా న్యాయస్థానాల్లో పోరాడాలని నిర్ణయించుకుని దూరంగా ఉండడం జరిగిందన్నారు. దానికి భయపడ్డారని, పారిపోయాడని మాట్లాడడం తగదన్నారు. అక్రమ మైనింగ్ సంబంధించి ఈ ప్రభుత్వం రాకమునుపే అక్రమంగా జరిపే కొన్ని కంపెనీల పై గత ప్రభుత్వం దాదాపు 250 కోట్లు ఫైన్ వేయడం జరిగిందన్నారు. ఆ ఫైన్ కలెక్ట్ చేసుకోవలసిన బాధ్యత మైనింగ్ డిపార్ట్మెంట్ మీద ఉంటుందన్నారు. ఈ ప్రభుత్వం వచ్చాక మైనింగ్ మొత్తాన్ని ఆపడం జరిగింది. మైనింగ్ సంస్థలు అన్నిటి మీద ఎంక్వయిరీ వేయాలని చెప్పింది. ఎంక్వయిరీ రిపోర్ట్ వెళ్ళిన తర్వాత ఫైన్ వేయని కంపెనీలను ఓపెన్ చేయకుండా ఫైన్ వేసిన కంపెనీ తిరిగి ఓపెన్ చేయడం జరిగిందన్నారు. దాదాపు 250 మైన్ల లో 100 యాక్టివ్ మైన్లు ఉంటే వాటిని ఓపెన్ చేయకుండా గతంలో ఫైన్ వేయబడిన 30 మైన్లను మాత్రమే ఓపెన్ చేయడం జరిగిందన్నారు. గతంలో అక్రమ మైనింగ్ జరిగిందంటూ కాకాని గోవర్ధన్ రెడ్డిపై కేసులు పెట్టి వేధిస్తున్న ప్రభుత్వం ఇప్పుడు జిల్లాలో జరిగే అక్రమ మైనింగ్ పై నోరెత్తడం లేదన్నారు. గత ప్రభుత్వంలో అక్రమ మైనింగ్ జరిగిందని చెబుతున్న ఈ ప్రభుత్వం గత ప్రభుత్వంలో మైనింగ్ ద్వారా 150 కోట్లు ప్రభుత్వానికి ఆదాయం వస్తే ఈ ప్రభుత్వంలో 30 కోట్లు కూడా రావడం లేదు. పార్టీలకు అతీతంగా మీడియా మైనింగ్ జరిగే సైదాపురం మండలానికి వెళ్లి గత ప్రభుత్వంలో మైనింగ్ జరుగుతున్నప్పుడు అక్కడ రైతులకి, కూలీలకి ఎటువంటి ప్రయోజనాలు దక్కాయి. ఈ ప్రభుత్వంలో రైతులకు ఎటువంటి ప్రయోజనం జరుగుతుంది కూలీలకి ఏమాత్రం పని దొరుకుతుంది అనేది ఎంక్వయిరీ చేస్తే ఈ ప్రభుత్వంలో జరుగుతున్నది ఏంటో మీకే తెలుస్తుంది. మీరు మైనింగ్ ఆపేసిన సుమారు 80 కంపెనీలు ద్వారా ఎన్ని కుటుంబాలు వీధిన పడ్డాయి, ఎంతమంది ఉపాధి కోల్పోయారు, అదే మైనింగ్ జరిగి ఉంటే ఎంతమంది కూలీలకు పని దక్కేది, ఎంతమంది లారీ యజమానులు, లారీ డ్రైవర్లు క్లీనర్లు, అవి తిరిగే దారుల్లో చిరు వ్యాపారులు, పెట్రోల్ బంకులు ఇలా ఎంతమందికి ఉపాధి దక్కేది మీరే ఆలోచించండి. మైనింగ్ చేసే వారిలో అన్ని పార్టీల వారు ఉన్నారు. కానీ అన్ని మైన్లను మూసి వేయించి కేవలం కొన్ని మైనింగ్ కంపెనీలకు మాత్రమే పర్మిషన్ ఇవ్వడం జరిగింది. గత ప్రభుత్వంలో మైనింగ్ కంపెనీ ఓనర్లు ఎవరు కోర్టుకు వెళ్లిన సందర్భాలు లేవు. ఈ ప్రభుత్వంలో మైనింగ్ ఓనర్లు మాకు మైనింగ్ పర్మిషన్లు ఇప్పించమని కోర్టుకు వెళ్లడం జరిగింది. కోర్టు ఫిబ్రవరి 10లోగా అన్ని మైన్లను ఓపెన్ చేయమని ఆదేశాలిస్తే ఈ ప్రభుత్వం పట్టించుకోకపోతే మైనింగ్ కంపెనీ ఓనర్లు కంటెంట్ ఆఫ్ కోర్టుకి వెళ్లడం జరిగింది. ఫెమీ అనే మైనింగ్ ఓనర్ అసోసియేషన్ సంస్థ ఒకటి మైనింగ్ ఆపేయడం వల్ల జరిగే జరుగుతున్న నష్టాలు సంబంధించి ప్రభుత్వానికి లేఖ రాయడంతో పాటు, చంద్రబాబు ని టాక్ చేస్తూ ట్విట్టర్ లో కూడా టీ చేయడం జరిగింది. మందకృష్ణ మాదిగ లాంటి మాదిగ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు తమ సామాజిక వర్గం వారు ఎక్కువగా మైనింగ్ పై ఆధారపడి బతుకుతున్నారని మైన్లను ఓపెన్ చేసి వారికి జీవనాధారం మైనింగ్ విభాగానికి సంబంధించిన కాంతారావు గాని కలిసి విన్నవించడం జరిగింది. గతంలో మైనింగ్ ఓనర్లు అందరూ కలిసి నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ని కలిసి మా మైన్లను నేను ఓపెన్ చేయించమని అడిగితే ఆయన నా మీద వస్తున్న ఆరోపణలు అన్ని అబద్ధం, నాకు సంబంధం లేదు, మంత్రి గారితో చెప్పి ఓపెన్ చేస్తానని చెప్పి అన్నారని తెలిసింది. కానీ ఇప్పుడు మైనింగ్ జరిపే కంపెనీలలో లక్ష్మీ క్వార్జ్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీలో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి డైరెక్టర్ గా ఉన్నారు. ఆ కంపెనీ మాత్రమే క్వార్జ్ ను చేసింది. తర్వాత రోజులలో ఫిని క్వార్జ్ అనే మరో కంపెనీని ఏర్పాటు చేయడం జరిగింది. ఆ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ గా మన్నెమాల విజయ్ కుమార్ రెడ్డి ఉన్నారు. ఆయన ఎవరో ఎక్కడుంటారో మీడియా మిత్రులకు అందరికీ తెలుసు. అప్పటినుండి ఫిని క్వార్జ్ మాత్రమే ఎగుమతి చేస్తుంది. గత ఎనిమిది నెలల్లో నాలుగు నెలలు లక్ష్మీ క్వార్జ్ , మరో నాలుగు నెలలు ఫిని క్వార్జ్ మాత్రమే ఎగుమతులు చేశాయి. మిగిలిన కంపెనీలు ఎందుకు ఎగుమతి చేయలేకపోతున్నాయి. దాదాపు 25 మంది మైనే కంపెనీ ఓనర్లు ఉంటే వారికి ఎవరికీ అనుమతి లేకుండా ఈ రెండు కంపెనీల ద్వారానే ఎందుకు ఎగుమతి జరుగుతుంది అనేది మీకే తెలుసు. ఈ రెండు కంపెనీలకు సరెండర్ అయిన మైన్లు మాత్రమే ఓపెన్ చేయడం జరిగింది. వారి మెటీరియల్ మాత్రమే ఈ రెండు కంపెనీల ద్వారా ఎగుమతి చేయడం జరుగుతుంది. మిగిలిన ఎవరికి అనుమతి ఇవ్వడం లేదు. నెల్లూరు చరిత్రలో ఎంతో ప్రాముఖ్యత ఉన్న వెంకటగిరి రాజా మైన్ ను ఆపివేయడం జరిగింది. ఆయన నా మైన్ మీద ఆధారపడిన ఎంతోమంది ఇబ్బంది పడుతున్నారు ఓపెన్ చేయమని అడగని నాయకుడు లేడు. ఇంతటి వ్యక్తికి ఈ ప్రభుత్వం ఇచ్చే గౌరవం ఇది. వేమి రెడ్డి కి ఈ మైన్ ల ద్వారా ఎంత వస్తుందో తెలియదు గానీ మూసివేసిన కంపెనీల మీద కూలీల ఉసురు మాత్రం తగులుతుందని గుర్తుపెట్టుకోండి. జిల్లా మైనింగ్ ఆఫీసర్ సర్వే చేసి 33,000 టన్నుల మెటీరియల్ ఉందని గతంలో పంచనామాలో రాసిస్తే అది జరిగిన ఏడు నెలల తర్వాత 1,20,000 టన్నుల మెటీరియల్ ఉంది దాన్ని ఎగుమతి చేయడానికి అనుమతి ఇవ్వండి అని అప్లై చేశారు, మైనింగ్ జరగకుండా మెటీరియల్ క్వాంటిటీ ఎలా పెరిగింది. 50 సంవత్సరాలు పూర్తయిన మైన్లు లో అన్ని ప్రభుత్వానికి చెందుతాయి. ఎందుకు స్వాధీనం చేసుకోవడం లేదు. మైనింగ్ జరిగే ప్రదేశాలను ఆధారాలతో ఫోటోలు వీడియోలతో మీ ముందు ఉంచుతున్నాము దీని మీద ఎందుకు కేసులు పెట్టరో చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో అక్రమ మైనింగ్ సంబంధించి మేము ఫైన్ వేసిన అమర్నాథ్ రెడ్డి అనే ఒక వ్యక్తి మళ్లీ ఇప్పుడు మైనింగ్ చేస్తున్నాడు. నెల్లూరులో అల్లరి చిల్లరగా తిరిగే గంజాయి అలవాటు ఉండే కొంతమంది వ్యక్తులు అక్కడ చేరి ఆ మైన్ల ల పరిశీలనకు ఎవరూ వెళ్లకుండా అడ్డుకుని దాడులు చేస్తున్నారు. మీడియాని, అధికారులు కూడా రానివ్వడం లేదు. నా మీద ఎటువంటి ఆధారాలు లేకుండా నిందలు వేస్తున్న మీరు ఇప్పుడు ఇక్కడ జరుగుతున్న మైనింగ్ పై ఏం చెప్తారు. వేమిరెడ్డి సమాధానం చెప్పాలి. మైనింగ్ ఓపెన్ చేయమని మీ దగ్గరికి న్యాయం కోసం వస్తే న్యాయం చేయాల్సింది పోయి మీరే కంపెనీలు ఓపెన్ చేసి అంతా మాకేమన్నని బెదిరింపులు దిగడం ఎంతవరకు న్యాయం. దాదాపు 1500 కోట్లు విలువైన అక్రమ మైనింగ్ జరిగింది. మా నాయకులు పైన కేసులు పెడుతున్న ప్రభుత్వం ఇప్పుడు వేమి రెడ్డి గారిపై ఎందుకు పెట్టదు. అంటే డబ్బు ఉన్నోడికి ఒక న్యాయం సామాన్యుడికి ఒక న్యాయమా. దీనిపై సమాధానం చెప్పాల్సిన అవసరం వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి ఉందన్నారు. మైనింగ్ ఓనర్ల తరపున పోరాటానికి నేను సిద్ధంగా ఉన్నాను. నేను అన్నిటికి సిద్ధపడే వచ్చాను. అన్ని మైన్లను ఓపెన్ చేసి అందరికీ అవకాశం ఇవ్వండి లేదంటే మీవి కూడా మూసివేయండి. సామాన్యులపై లక్షల రూపాయల ఫైన్లు వేసి వారిని అణిచివేసి మొత్తం ఖంణిజం మాకే అమ్మండి లేదా మూసి వేయండి అని బెదిరిస్తున్నారు. సామాన్యులను అణిచివేసి మొత్తం మైనింగ్ మేమే చేసుకుంటాం మేమే సంపాదించుకుంటాం అంటే కచ్చితంగా ఆ సామాన్యులు వెంట నేను పోరాటానికి సిద్ధమన్నారు. డిఎంజి ప్రవీణ్ ఇచ్చిన జీవో ప్రకారం ఎన్విరాన్మెంటల్ క్లియరెన్స్ లేకుండా టెంపరరీ మైనింగ్ పర్మిషన్ ఇచ్చే అవకాశం లేదు కానీ మైనింగ్ జరుగుతుందంటే ఇదంతా అక్రమ మైనింగ్ కాదంటారా అని ప్రశ్నించారు.




# ఘోర రోడ్డు ప్రమాదం ముగ్గురు నెల్లూరు వాసులు మృతి



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మే 4)

ఒంగోలు సమీపంలో ఆదివారం తెల్లవారు జామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నెల్లూరుకు చెందిన ముగ్గురు వాసులు మృతి చెందినట్లు పోలీస్ అధికారులు ధ్రువీకరించారు. కోడిగుడ్లతో గుంటూరు నుంచి బయలుదేరిన లారీ కొప్పోలు దగ్గర బోల్తా కొట్టింది . ఈ సంఘటనలో లారీలో ఉన్న నెల్లూరుకు చెందిన రమణయ్య (60) బాబు (45) నాగేంద్ర (25) చనిపోయారు. ఈ ఘటనతో ఘటన జరిగిన ప్రదేశంలో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. పోలీసు ఉన్నతాధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్కును క్రమబద్ధీకఇంచారు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు.

# ఎమ్మెల్యే తాటిపర్తి పరామర్శ





(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, మే 4)

మండలంలోని పోతంపల్లి గ్రామంలో వలపర్ల వారి ఓణీల ఫంక్షన్‌లో దేవరాజుగట్టు శివాపురం గ్రామాలలో ఇటీవల కాలంలో వైసీపీ కార్యకర్తలు పెనుగొండ రామచంద్రారెడ్డి, బట్టగిరి వెంకటేశ్వరరెడ్డి మృతి చెందారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే తాటిపర్తి చంద్ర శేఖర్ వారి చిత్ర పటాలకు నివాళిలు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు..అదే గ్రామానికి చెందిన ఇటీవల అనారోగ్య పాలైన వైసిపి నాయకులు వల్లెల ఈశ్వర్ రెడ్డి, గూడ సుబ్బా రెడ్డి ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి వెంకట్ రెడ్డి.జడ్పిటిసి ఏరువా చలమారెడ్డి, వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి ఏలూరి వెంకట నారాయణరెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షులు వజ్రాల ఆదిరెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ శౌంఠి నాగార్జునరెడ్డి, యూత్ అధ్యక్షుడు దుగ్గెం దినేష్, బట్టగిరి రమణరెడ్డి, మెట్టు భాస్కర్‌రెడ్డి, వలెల్ల చెన్నారెడ్డి, మారంరెడ్డి శివరెడ్డి, మెట్టు నాగార్జునరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# బూత్ కమిటీల నియామకం



(షణ్ముఖ వెలుగు, పొదిలి, మే 4)

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం పట్టణంలోని పొదిలి ట్రైలర్స్ కాలనీ నందు టీడీపీ బూత్ కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో పొదిలి పట్టణ అధ్యక్షులు ముల్లా ఖుద్దూస్, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి గునుపూడి భాస్కర్, మాజీ సర్పంచ్ కాటూరి నారాయణ ప్రతాప్, జిల్లా ముస్లిం మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్, ఏఎంసి ఛైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంసా, జె మల్లి, షేక్ లతీఫ్, కాటూరి హనుమంతరావు, చాగంటి వెంకట్రావు, డి వెంకట్రావు, చాగంటి రాజశేఖర్, ప్రసాద్, గాలిముట్టి బాబు, దార రమేష్, అంజయ్య, సులేమాన్, ఖాదర్ బాషా, రాములు, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి అచ్చెంనాయుడుని కలిసిన పెద్దారవీడు మండల

## మాజీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గొట్టం శ్రీనివాసరెడ్డి

(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, మే 4)



విశాఖపట్నంలో తిరుమల తిరుపతి దేవస్థానం వారిచే నిర్మితమైన కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో మర్యాదపూర్వకంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెం నాయుడుని పెద్దారవీడు మాజీ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గొట్టం శ్రీనివాస్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.

# వేల మంది జంటలను ఒక్కటి చేయటం జాతికే గర్వకారణం

## తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యులు వైద్యం శాంతారాం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 4)

వేల రూపాయలు తీసుకుంటూ సరైన వధూవరులను సుముకూర్చలేని రోజులలో నాయి బ్రాహ్మణ ఉచిత వివాహ పరిచయ వేదిక ద్వారా వేల మంది జంటలను ఒక్కటి చేయటం జాతికే గర్వకారణం అని తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యులు వైద్యం శాంతారాం అన్నారు. ఒంగోలు నగరంలోని పద్మావతి ఫంక్షన్ హాల్ నందు నాయి బ్రాహ్మణ ఉచిత వివాహ ఐదవ పరిచయ వేదిక సందర్భంగా జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సుమారు ఆరు రాష్ట్రాల నుంచి ప్రతినిధులు వచ్చి ఇక్కడ వివాహ పరిచయ వేదిక ద్వారా వధూవరులు తమ యొక్క బయోడేటాలను అందించి ఒక్కటి కావడం చేసే కృషికి అభినందనీయమని అన్నారు. గత నాలుగు సార్లు జరిగిన వివాహ పరిచయ వేదిక ద్వారా సుమారుగా మూడువేల మందికి పైగా నాయి బ్రాహ్మణ కుటుంబాలలో జంటలు ఒకటయ్యారని ఐదు వివాహ పరిచయవేదిక కూడా సుమారు 1000 మంది వధూవరులకు సంబంధించిన బయోడేటాలు రావటం చాలా సంతోషమని తెలిపారు. ప్రకాశం జిల్లా నాయి బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక ద్వారా చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమాల ప్రారంభించి రెండు మాసాలలో ఆంధ్రప్రదేశ్ తెలంగాణ కర్ణాటక తమిళనాడు మహారాష్ట్ర ప్రాంతాలలో ఉన్నటువంటి నాయి బ్రాహ్మణ కులంలో చదువుకొని ఉద్యోగం చేసుకుంటూ లేక వృత్తులు చేసుకుంటూ ఉంటున్నటువంటి యువతీ యువకులను ఒక్క దగ్గరకు తీసుకొచ్చి వివాహ సంబంధాలను కుటుంబ బంధాలుగా చేస్తున్న ప్రకాశం జిల్లా నాయి బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక సభ్యులను ప్రత్యేకంగా అభినందిస్తున్నానని అన్నారు. ఇలాంటి వేదికలు ఎన్నో జరుపుకోవాలని నాయి బ్రాహ్మణుల్లో ఒక ఆదర్శంగా నిలవాలని అవసరం ఉందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాణిపాకం గణపతి దేవస్థానం ఈవో పెంచుల కిషోర్, నాయి బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పుటూరి బాల గురుస్వామి, డాక్టర్ వెంకటరమణ కే వీరాంజనేయులు, నాయి బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక కన్వీనర్ రాఘవ, పోతకమూరి మధుబాబు, గుంటూరు ఆదియ, గుంటూరు రాంబాబు, పెళ్లూరు చిన్న వెంకటేశ్వర్లు, నిడమానూరు రమేష్ అన్నవరపు వెంకటేశ్వర్లు, నాయి బ్రాహ్మణ ఉద్యోగుల సంఘం నాయి బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు సంఘీయులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com